# మరీచిక

'ఊరకరారు మహాత్ములు' అంటారు. తీరని పనుల్లో నుంచి తీరిక కల్పించుకుని మామగారు హఠాత్తుగా ఊడిపడటం ప్రకాశానికి ఆశ్చర్యం కలిగించడంలో అబ్బురమేమీ లేదు. వస్తూ వస్తూ ఆయనొక్కరే వచ్చారు గూడా కాదు; తనవెంట శోభను గూడా తీసుకొచ్చారు. కానీ ఇక్కడొక సందేహం ప్రకాశానికి. మామయ్య శోభను తీసుకొచ్చాడా, లేక శోభే తనవెంట మామయ్యను తీసుకొచ్చిందా అని.

ఊళ్ళోకి కారురావడమైతే పొలంలోనుంచే చూశాడు ప్రకాశం. కానీ అది మామగారి కారని గుర్తించలేకపోయాడు. ఎలా గుర్తించగలడు? ఆకసంలో మబ్బులు మారినట్లు, ప్రకృతి పైన ఋతువుల ప్రభావం మారినట్టు మామయ్యగారి అభిరుచులు కూడా తరచుగా మారిపోతూ ఉంటాయి. క్రితంసారి (అనగా మూడు మాసాలనాడు) ప్రకాశం చూచినప్పుడు మామయ్యగారిది విష్ణుదేవుడి రెండో అవతారమైన ఆదికూర్మంలాంటి కారు. ఇప్పుడు ఊళ్ళోకి వచ్చింది అది కాదు. ఇది జర్రిపోతులాంటి సరిక్రొత్తరకం కారు.

అయిదు నిమిషాలు గడవకముందే తమ్ముడు చంద్రం గసబోసుకుంటూ పరుగెత్తి వచ్చి "అన్నయ్యా! వచ్చిందెవరో చెప్పుకోచూద్దాం" అన్నాడు.

"బడలిక కాస్త తగ్గిన తర్వాత నువ్వే చెప్పు" అన్నాడు ప్రకాశం.

"ఎవరో అయితే నేనిలా దౌడుతీస్తూ వచ్చేవాడినేనా అన్నయ్యా! మామయ్యగారు శోభాదేవిగారితో సహా విజయం చేశారు" అన్నాడు చంద్రం.

ప్రకాశం విన్నాడు. కానీ విననట్టే చెరకునాటిన చాళ్లకు నీళ్ళు కట్టుకోసాగాడు.

"అదేమిటన్నయ్యా! అమ్మ నిన్ను నిల్చున్న పాళాన పరుగెత్తుక రమ్మన్నది"

ప్రకాశం నవ్వాడు. అమ్మ ఆ మాట చెప్పి ఉండదని ప్రకాశానికి తెలుసు. వచ్చిన బంధువులకు ఆమె తనంతట తానే ఆతిథ్య మర్యాదలు నెరపుకోగలదు. అందులో ఆమెకు తన తోడ్పాటు అనవసరం. కాని చంద్రం ఉద్దేశం వేరు. మామయ్యగారంతటివారు శోభాదేవితో సహా తమ గృహాన్ని పావనం చేస్తుంటే తానెదురేగి స్వాగత సత్కారాలు నెరపక పోవడం అనుచితమనీ, అసమంజసమనీ వీడి భావం.

"అలాగే వెళ్తానుగానీ నేను చేస్తున్నపని నువ్వు చేయాలిరా చంద్రం" అన్నాడు ప్రకాశం.

'ఓ అదెంతపని' - అన్నట్టు పాంటు పైకెగమడిచి పారందుకున్నాడు చంద్రం.

పట్టణంలో ఫిఫ్తుఫారం చదువుతూ సెలవుల్లో స్వగ్రామానికి వచ్చిన విద్యార్థి చంద్రం. అయినా అతనిది నీరెండకు శోషిల్లిపోయే సుతిమెత్తని ప్రాణంకాదు. పార చేతబట్టుకుని కాలువ త్రవ్వకానికి పూనుకుంటే జామసేపు వంచిన నడుము పైకెత్తకుండా ఇసుక త్రవ్విపోయగలడు చంద్రం. తలకు గుడ్డ చుట్టుకొని, ముందు మడక చేతికి తీసుకుంటే అతడు కోడెల్ని జవనాశ్వాల్లా పరుగెత్తించగలడు. అడవిలో ఆకు కొట్టి బండికెత్తితే నొగపైన చంద్రం తప్పితే మరొకరు కూర్చోడానికి వీలే లేదు. ఈ ఒళ్ళు దాచుకోకుండా పనిచేయడమనేది చంద్రానికి వంశపారంపర్యంగా సంక్రమించిన సుగుణం.

వ్యవసాయానికి సంబంధించిన కార్యకలాపాలన్నింటిలోనూ చంద్రానికి శిక్షాగురువు ప్రకాశం. పలక చేతికిచ్చి ఓనమాలు దిద్దబెట్టించినట్టే, పారా పలుగు చేతికిచ్చి ప్రకాశం తమ్ముణ్ణి పొలానికి పంపించాడు.

ప్రకాశం తమ్ముడికిచ్చిన శిక్షణ మాటలరూపంలో కాదు. అతడు చేసి చూపెట్టేవాడు. ఆ మాటకొస్తే పట్ట పరీక్షలో అగ్రశ్రేణిలో ఉత్తీర్ణుడైన ప్రకాశం పల్లెటూరికి తిరిగి వచ్చి, ఇక్కడే పాదుకోగలడని ఎవ్వరూ అనుకోలేదు. లాయరై రాష్ట్ర ముఖ్యనగరంలో బోర్డు కడతాడనుకున్నారు కొందరు. కాదు కాదు. ఫలానా కాలేజీలో లెక్చరరు కాబోతున్నాడనుకున్నారు కొందరు. అబ్బే లెక్చరరేమిటి, ఇరవయ్యేళ్ళకల్లా బియ్యే ముగించాడు కనుక అంతకంటే గొప్ప కొలువే దొరక వచ్చునని ఊహాగానాలు చేశారు కొందరు. అయితే అందరి ఊహల్ని తల్లక్రిందులు చేసేశాడు ప్రకాశం. కాలేజీ వార్షికోత్సవాల్లో నాటకాలాడి బహుమతులు సంపాదించుకొన్న ఉత్సాహాన్నీ, క్రీడారంగంలో బ్యాటు చేబట్టి క్రికెట్టు బాలును బౌండరీలు దాటగొట్టిన ఉత్సాహాన్నీ, మాక్ పార్లమెంటులో ప్రధానమంత్రిగా ఎన్నికై ప్రతిపక్ష సభ్యుల పిడివాదాలను చిన్న చిన్న ఛలోక్తులతోనే చిత్తు చిత్తు చేసిన ఉత్సాహాన్నీ అలాగే తనలో ప్రోది చేసుకొని వచ్చి, బావి గట్టున మామిడి చెట్టుక్రింద నిల్చుని 'ఈ పొలంలో బంగారం పండించాలి' అనుకున్నాడు ప్రకాశం.

నోళ్ళు బారగిల తెరుచుకొని ముక్కుమీద వ్రేలేసుకుని, మూకీభావంతోనే తమ ఆశ్చర్యాన్ని వెల్లడించుకున్నారు లోకులు.

'దూడలదుక్కి పడచుల సేద్యం', అంటూ లోలోపల సంతృప్తిపడ జూచిన వాళ్ళు కూడా లేకపోలేదు. అయితే మనసునూ శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుకుని, చిత్తశుద్ధితో కార్యోన్ముఖుడైన మానవునికి ఏవిద్య అయినా అసాధ్యం కాదు. కాదనే ఋజువు చేయగలిగాడు ప్రకాశం!

"హాలికులకు కుశలమా?" హాల్లో వాలుకుర్చీలో మేనువాల్చిన మాధవరావుగారు ప్రకాశంవైపు జాలిగా చూస్తూ పరామర్శించారు.

"జవాబు నీకు తెలిసిందేకదా మామయ్యా! పద్యాన్ని చర్విత చర్వణం చేయడమెందుకు?" అన్నాడు ప్రకాశం.

"ఎందుకా! ఉండబట్టలేక" గిరుక్కున ముఖం మరోవైపుకు త్రిప్పుకున్నారు మాధవరావు గారు.

ప్రొద్దు పడమటికి వ్రాలి, ఎండ కాస్త చల్లబడిన తర్వాత మామగారితో మాట్లాడవచ్చుననుకున్నాడు ప్రకాశం. శోభతో మాత్రం ఎప్పుడంటే అప్పుడే మట్లాడు కోవచ్చు. కాదంటే ఏ మాత్రం వేడి తగిలినా ఆపాలు పొంగిపోతుంది. పొంగినప్పుడల్లా కాసిన్ని మంచినీళ్ళు చిలకరిస్తూ ఉండాలి. ఆ కిటుకు ప్రకాశానికి బాగా తెలుసు!

కానీ ఎక్కడుంది శోభ? ఆమె మేడకు ముందువైపున తోటలో లేదు. పెరట్లో లేదు. వంటలక్కకు సాయపడుతున్న అమ్మనడిగితే "ఎక్కడుందో చూడరా బాబూ! నాకేం తెలుసు! నేనేమైనా కొంగులో ముడివేసుకున్నానా ఏమిటి?" అంటూ చిరునవ్వులు ఒలకబోసి ఆమె ప్రకాశాన్ని కాస్త ఉడికించడానికే పూనుకుంది. ప్రకాశం ఇల్లంతా వెదికి చివరకు శోభను మేడపైన గ్రంథాగారంలో సంధించాడు.

సన్నగా అంచులు వచ్చి, అక్కడక్కడా చిన్న చిన్న పువ్వులు పూచి, వన్నెలో గులాబీ రేకులా చెలువారుతున్న వాయిల్ చీరకట్టుకుంది శోభాదేవి. అది జాకెట్టో, చోలీయో, కాక బ్లౌజో నిర్దిష్టంగా దాని పేరేమిటో ప్రకాశానికి తెలియదు కానీ ఆ కంచుకం శోభాదేవి లావణ్యాలకు మరింత శోభనే సంతరిస్తోంది. ఆమె నుదుట మెరిసిపోతున్నది శుద్ధతదియ నాటి చంద్రరేఖ కాదు. చమ్కీ అద్దిన బొట్టు. మెడలో పచ్చలపతకం వ్రేలాడుతున్న తెల్లరాళ్ళ

నెక్లెసు. ఒక్కమాటలో చెప్పాలంటే అందాలకు మెరుగులు దిద్దుతున్న అలంకారాలు శోభాదేవివి. ఓ క్షణంపాటు ద్వారం దగ్గరే నిలబడిపోయాడు ప్రకాశం. వెన్నెల్లో అద్దాల మహిడీ ఎదుట నిల్చున్నట్లుగా ఉంది ప్రకాశం పరిస్థితి. కానీ ఆ మైమరుపు తృటిపాటులో చెదరిపోయింది. చెంపకు చేరడేసిగా ఉన్న ఆ కళ్ళ కుదింపు, ముద్దమందారాల్లాంటి ఆ పెదవుల బిగింపు, ముక్కుపుటాన ద్యోతకమౌతున్న చెమర్పు – ఇవన్నీ ప్రకాశానికి అతని ఊహకందని ఏదో ఉక్రోషానికి చిహ్నాలుగా మాత్రమే భాసిస్తున్నాయి!

"సుస్వాగతం శోభా! మాట మాత్రమైనా లేకుండా వచ్చేశావ్! వస్తావని తెలిసివుంటే ఏవైనా ఏర్పాట్లు చేయడానికి వీలుండేది..." అంటూ గదిలోకి ప్రవేశించాడు ప్రకాశం.

చల్లటి పలకరింపుకూడా శోభాదేవికి కోపకారణం కాగలదని ఎవ్వరనుకోగలరు!– "మాటలు నేర్చేవులే బావా! ఏం ఏర్పాట్లు చేసేవాడివి? లేదంటే మేళగాళ్ళని రప్పించి ఊరేగించే వాడివేమో! అంతే కదూ!" దురుసుగా నాలుగు మాటలు వడ్డించి, అంతటితో బదులుకు బదులు తీర్చుకున్నంత తృప్తిగా గోడవైపు చూస్తూ కూర్చుంది శోభ.

"ఆ ముచ్చటపైన నీకంతగా మనసుంటే కాదనడానికి నేనెవర్ని శోభా!" చిరునవ్వును పెదవుల చివళ్ళలో నొక్కిపట్టుకుంటూ అన్నాడు ప్రకాశం.

తటాలున తల పైకెత్తింది శోభాదేవి. ప్రకాశం కూడా తనవైపు ఓరచూపులు బరపుతున్నాడు. చూపులొండొంటితో కలుసుకున్నాయి. శోభాదేవి తలదించుకుంది. ఆ దించుకోడంలో ఆమెకు తన ఓటమి స్ఫురించి ఈ విధంగా మాట్లాడుతూ కూచుంటే ఈ మనిషిని జయించలేమబ్బా – అనిపించిందేమో, వెంటనే విషయాంతరంలోకి వచ్చేసింది.

"అబ్బబ్బ, ఈ గదిలోకి గాలైనా రాదు. ఎలా కూర్చుంటావో మరి! పైగా ఈ పుస్తకాల వాసనొకటి. చదువుకున్న వాడినేనన్న విషయాన్ని ప్రదర్శించడానికి కాకపోతే ఎందుకు బావా ఇన్ని పుస్తకాలు?" ముఖంపైన క్రమ్ముకుంటున్న స్వేదబిందువుల్ని తుడుచుకుంటూ, ఇక దీనికేం చెబుతావో చెప్పమన్నట్టుగా సర్దుకుని కూర్చుంది శోభాదేవి.

కిటికీ తలుపులు తెరిచి గాలిని లోపలికి ప్రవేశపెట్టడం ద్వారా శోభ చేసిన ఆరోపణలో పూర్వార్థాన్ని పూర్వపక్షం చేసి, ఉత్తరార్థానికి మాత్రం జవాబు చెప్పదలచుకున్నాడు ప్రకాశం. "ఈ పుస్తకాలు ప్రదర్శనంకోసమని నువ్వు భావించడంలో తప్పేమీలేదు శోభా! అసలు మానవ జీవితమంతా ప్రదర్శనార్థమేనన్న భావం బలపడిపోతోంది. చదువు సదసద్వివేకం కలిగించి ఆత్మవికాసానికి దోహదకరం కావడానికి కాదు. సంపద గంగా ప్రవాహంలా ప్రవహించి పాపంలాంటి లేమిని క్షాళనం చేయడానికి కాదు. అంగ సౌందర్యం విలువైన వస్తువులా దాచుకోడానికి కాదు. అన్నీ బడాయికోసమే! నువ్వు మహోన్నతమైన జీవిత విధానంగా భావిస్తున్న దానిలోనుంచీ ఈ ప్రదర్శనాన్నీ ఈ బడాయినీ మినహాయిస్తే మిగిలేదేమైనా ఉంటుందా శోభా! ఉండదనే నా విశ్వాసం".

"నువ్విలాంటి అనాగరికమైన బ్రతుకును ఎన్నుకున్నది అందుకేనా బావా?" అమాయికత్వాన్ని అభినయిస్తూ అడిగింది శోభ.

ప్రకాశం మళ్ళీ ఒకసారి నవ్వక తప్పిందికాదు. శోభ తనను అనాగరికుణ్ణిగా భావించడంలో విడ్డూరమేమీలేదు. ఆమె ఉద్దేశాన్ని అనుసరించి నాగరికత ఫ్యాన్సీ షాపుల్లోని అద్దాల బీరువాల్లో నిక్షిప్తమై ఉంటుంది. హేరాయిలు బాటలును బ్రద్దలు చేసి, ఫేసు పౌడరు డబ్బాను చితకగొట్టి, పెదవులపైన రంగు తుడిచేస్తే అంతటితో ఆ నాగరికత

ఆఖరు. అలాంటి బుద్బుదప్రాయమైన నాగరికత పట్ల ప్రకాశానికి జాలి మాత్రమే కద్దు. మోజులేదు.

శోభ ఏదో పనివున్నట్టులేచి క్రిందికి వెళ్లిపోయింది. పదిపదిహేను నిమిషాలు గడచిపోయిన తరువాత ప్రకాశం ఆలోచనలోనుంచీ తేరుకుని క్రిందికి దిగివచ్చేసరికి ఆమె పట్టెమంచంపై బోరగలిపడుకుని కాగితపుటంచులకు ఎరుపురంగు పూసిన అపరాధ పరిశోధక నవలలో లీనమైవుంది.

ప్రకాశం నిట్టూర్చాడు. శోభకు తన గ్రంథాగారం ఎలా రుచిస్తుంది మరి? పది పేజీలు చదివేలోగానే హత్య జరిగిపోవాలి. ఆపైన అనుమానం ఒకరిపై నుండి మరొకరిపైకి వెళ్తూ వచ్చి చివరకు అనుమానించడానికి బొత్తిగా వీల్లేని వ్యక్తి హంతకుడుగా ఋజువు కావాలి. ఊపిరిబిగబట్టి ఉద్వేగంతో ఉక్కిరి బిక్కిరౌతూ పుస్తకంలోని పుటలవెంట కళ్ళనూ, మనసునూ పరుగెత్తించినందుకు హంతకుడెవరో తెలియడమే ప్రతిఫలం. చదివిన తర్వాత ఒకటి రెండు రోజుల వరకూ ఎవరు పిలిచినా ఉలికిపడుతూ, ఏ నీడ కనిపించినా అదిరిపడుతూ ఉత్తపుణ్యానికి బెంబేలు పడిపోవడమే ఫలశ్రుతి.

"ముత్యాలు రాలిపోతాయన్న భయం లేకపోతే ఆ చదివేదేమిటో బలంగానే చదవకూడదా శోభా! నేనూ కాసేపు వింటాను" అంటూ మంచంపైన ఓ వారగా కూర్చున్నాడు ప్రకాశం.

"బిగ్గరగా చదవడానికిదేమైనా భారతమా, భాగవతమా !" అంటూ మంచం అంచుకు జరుక్కుని, క్రిందికి జారిపోబోయింది శోభాదేవి.

"ప్రమాదం, ప్రమాదం! అంతగా ఇష్టం లేకపోతే దూరంగా వెళ్ళిపొమ్మనకూడదా శోభా!" అంటూ క్రిందికి దిగేశాడు ప్రకాశం.

"ఇది మరీ బాగుంది. మీ ఇంటికి వచ్చి నిన్నే దూరంగా వెళ్ళిపొమ్మనడమా!" బుంగముఖం పెట్టి ప్రకాశంవైపు కొరకొర చూపులు చూచింది శోభ.

"ఇదిగో ప్రకాశం! మామయ్యను స్నానానికి రమ్మను. అన్నట్టు శోభ ఎక్కడ?" అంటూ గుమ్మం దగ్గరికి వచ్చి నిల్చుని "రావమ్మా శోభా! వడ్డించడమైనా నీచేతనౌతుందో కాదో చూడాలి" అంది పార్వతమ్మ.

"ఆ పనికూడా నువ్వే చేసేస్తే, మిగిలిన కార్యక్రమాన్ని శోభాదేవిగారు సలక్షణంగా నిర్వహిస్తారులేవే అమ్మా!" అంటూ గొల్లున నవ్వేశాడు ప్రకాశం.

భోజనాలు పూర్తయ్యేసరికి ఒంటిగంట కావచ్చింది. ఇంటిల్లిపాదీ పడుకుని పైకి లేచేసరికి గంట మూడు దాటింది. పాలేరును వెంటబెట్టుకుని వెళ్ళి చంద్రం కొట్టించి తీసుకొచ్చిన తాటికాయలను చూడగానే మాధవరావు గారికి ప్రాణాలు లేచివచ్చాయి. "అమ్మాయ్ శోభా! సూక్ష్మంలో మోక్షంగా కానీ ఖర్చయినా లేకుండా చంద్రం ఉపాహారం సిద్ధపరిచేశాడు. ఎలాగైనా పల్లెటూరివాళ్ళు తెలివైన వాళ్ళు" అంటూ ఆయన తాటిముంజలు కబళించడంలో నిమగ్నులయ్యారు.

అంతలో మంచినీళ్ళ దుత్తలంతేసి ఎడనీరు టెంకాయలతో చిన్నపాలేరు ప్రత్యక్షమయ్యాడు.

కమ్మని ఎడనీటిని కడుపునిండుకూ ఆస్వాదించి గర్రున త్రేన్చారు మాధవరావుగారు.

బయట వడగాడ్పుల ఉధృతం కాస్తా తగ్గేసరికి లోపల పార్వతమ్మ పళ్ళేరాలనిండుకూ పకోడీలను గ్లాసులనిండుకూ కాఫీని హాజరుపరిచింది.

మాధవరావుగారు నోరు విడిచేశారు. "ఇలాగైతే మనం ఆరోగ్యంగా ఇల్లుచేరుకోడం సందేహమేనమ్మా శోభా! లేకపోతే ఈ చిరుతిండ్లు ఒకదాని తరువాత ఒకటిగా ఇలా ప్రత్యక్షమయ్యేవేనా? కానీ, ఏం చేద్దాం మరి! వాళ్ళు ప్రియంగా తీసుకొస్తే మనం వద్దని చెప్పలేము కదా!" కొత్తిమేర ఘుమాయింపులతో నోరూరిస్తున్న పకోడీలపట్ల ప్రలోభపడకుండా ఉండలేకపోయారు మాధవరావుగారు.

"అలా పొలాలవైపు వెళ్లొద్దాం. వస్తావా మామయ్యా?" అంటూ మాధవరావుగారిని కదిపి చూచాడు చంద్రం.

"నన్నిలాగే ఈ వాలుకుర్చీలో సేదతీరనివ్వరా చంద్రం! శోభకీఇంట్లో ప్రొద్దుపోవడం లేదేమో పాపం, వస్తుందేమో అడిగిచూడు..."

టాయిలెట్ చేసుకుని వాహ్యాళికి సిద్ధంగానే ఉంది శోభాదేవి.

"ఫ్లాస్కులో పోసివుంచాను. మీ బావకు కాఫీ తీసుకెళ్తావటమ్మా శోభా?" మెత్తగానే ఓ పని పురమాయించింది పార్వతమ్మ.

"ఎందుకులేవదినా, ఫ్లాస్కు, నేనే తీసుకొస్తానుగానీ! నువ్వు నీ ఎత్తుమడమల బూట్లతో గనుమలమీద పడిపోకుండా నడిస్తేచాలు..." ఫ్లాస్కును భుజానికి తగిలించుకుని ముందుగా దారితీశాడు చంద్రం.

సంధ్యాసమయం కన్నులకు పండువుగా ఉంది. ఎండల మూలంగా బడలిపోయిన ప్రాణాలకు హాయిని గొలుపుతూ పైరుగాలి చల్లగా వీస్తోంది. ఊరు దాటుకోగానే పంటపొలాలు, ఆ పొల్లాల్లోబడి అర ఫర్లాంగు దూరం నడవగానే ఓ చిన్నయేరు. ఏటిగట్టున కొబ్బరితోట. "ఇక్కడనుంచీ మన పొలాలు ప్రారంభమౌతాయి వదినా! గుర్తుంచుకో, ఎందుకైనా మంచిది" అన్నాడు చంద్రం.

ఏపుగా పెరిగి చలువ పందిరిలా క్రమ్ముకున్న కొబ్బరిచెట్లలోనుంచీ, సన్నగా మెలికలు తిరుగుతూ వెళ్తున్న కాలిబాటవెంట శోభాదేవిని నడిపించుకపోతున్నాడు చంద్రం. ఏ లగ్నాన పుట్టాడోగానీ వాడి నోరు క్షణం సేపైనా ఊరుకోదు. దారిపొడుగునా అతడి లెక్చరు నిర్విరామంగా సాగిపోతుంది. "ఈ చెట్టుంది చూచావా వదినా! ఇది మన తోటలోకెల్లా పొడుగాటి చెట్టు. ఒకసారి మా చిన్న పాలేరుతో పందెం వేసుకుని ఈ చెట్టుపైకి ఎగబ్రాకేశాను. ఎక్కడినుంచి చూచాడో మరి! అన్నయ్య పరుగెత్తుకొచ్చేశాడు. నేను మెల్లగా క్రిందికి దిగడమేమిటి, అన్నయ్య నా తలపైన వేడి వేడిగా నాలుగు మొటికలు వడ్డించడమేమిటి, రెండూ ఒక్కసారిగా జరిగాయి. భద్రంగా చూచిరా వదినా! ఒకసారి నేనూ నీలాగే ఆకాశంకేసి చూస్తూ నడిచి ఇక్కడ కాలుజారి బురదలో దబ్బున పడిపోయాను. ఇదిగో ఇక్కడనుంచీ మన మామిడి తోపు, అదే మన మిషనుబావి, బావిలో నీలావు కొరమీనులున్నాయి వదినా! చూద్దువు రామరి".

"పోయిన వేసవిలో మేము మహాబలిపురం వెళ్ళొచ్చాము చంద్రం! నీలాగే మాకొక గైడు దాపురించాడు" చిరాకుతో ఓ చురక తగిలించింది శోభాదేవి.

ఉత్సాహం కాస్తా చప్పబడిపోయిందేమో, చంద్రం నడకలో కూడా శోభాదేవికి వెనుకబడిపోయాడు.

బావిదగ్గరికి రాగానే అదే తన గమ్యస్థానమైనట్టు కానుగచెట్టు క్రింద నిల్చుని చుట్టూ కలయజూడసాగింది శోభాదేవి.

ఆవులిస్తే ప్రేవులు లెక్కపెట్టగలడు చంద్రం. "అన్నయ్యకోసమా వదినా! ఉండుండు. ఇప్పుడే పంపిస్తాను" ఫ్లాస్కును కానుగచెట్టు కొమ్మకు తగిలించి అతడు విహంగంలా తుర్రున పారిపోయాడు.

నీటిలోనుంచి బయటపడిన చేపలా క్రొత్త పరిసరాల మధ్య ఒంటరిగా నిల్చుంది శోభాదేవి. ఓవైపున కనుచూపు ఆనినంతవరకూ పచ్చటి తివాసీలా ఉన్న పైరుపచ్చలు, మరోవైపున పశ్చిమాకాశానికి అడ్డంగా కొబ్బరితోటలు, రసాల వనంలోంచి వినిపిస్తున్న కోయిలకూత, సంధ్యాసూర్యుడి సువర్ణ కాంతులు, క్రొత్త ప్రపంచంలా భాసిస్తున్న ఆ ప్రదేశంలో ఒకటి రెండు నిమిషాల పాటు అవశురాలై నిల్చుండిపోయింది శోభాదేవి.

"వచ్చేశావా శోభా! ఈ రోజు సాయంత్రం ప్రకృతి ఇంత అందంగా ఉందేమిటా అనుకున్నాను. కారణం చంద్రం చెప్పగా తెలిసింది". నడుముకు చుట్టుకున్న ఉత్తరీయాన్ని తీసి పచ్చికపైన పరుస్తూ "కూర్చో శోభా! సృష్టి సౌందర్యాన్నంతా ఈ రోజే తనివి తీరేటట్టుగా చూచేస్తే, ఇంక రేపటికేమి మిగిలేటట్టు?" అన్నాడు ప్రకాశం.

"సృష్టిలోకెల్లా చిత్రమైన వాడివి బావా నువ్వు! నిన్ను చూస్తుంటే చాలు, ఇంకా సృష్టిని కూడా చూడాలా ఏమిటి?" ఉత్తరీయాన్ని భుజాలపైన పూలదండలా వేసుకొని పచ్చికపైన కూలబడిపోయింది శోభ.

"అదేమిటి శోభా! నీనోటంట అపూర్వమైన మాటలు వింటున్నాను. నాలో ఏం చిత్రం కనిపించింది నీకు?" విస్మయంతో ప్రశ్నించాడు ప్రకాశం.

"లేకపోతే ఇదేం బ్రతుకు బావా! ఏముందిక్కడ? మరికొంత సేపటికి చీకటి పడుతుంది. చీకటిలో ఈ చెట్లు, ఈ తోటలు జడలు విప్పుకున్న దయ్యాల్లా కనిపిస్తాయి. నడవడానికి దారైనా కనిపించదు. ఇందాక నేను వీధిలో నడచివస్తుంటే నన్నొక వింత మృగానికి మల్లే చూచారు. ఎవరినో సాధించాలన్న హఠం కాకపోతే, ఇక్కడ దేన్ని చూచుకొని బ్రతుకుతున్నావు బావా నువ్వు!"

ప్రకాశం తలవంచుకుని కూర్చున్నాడు. శోభకు బదులు చెప్పడమైతే సులభమే! కాని ఆ జవాబు ఆమెకు రుచిస్తుందన్న నమ్మకం మాత్రం తనకు లేదు. అయినా ప్రయత్నించడం తన విధి.....

మళ్ళీ కొనసాగిస్తోంది శోభ. "నువ్వు ఋషీశ్వరుడిలా కాలం గడప తలచుకుంటే మేము నీకు తపోభంగం కలిగించాలన్న దురుద్దేశంతో వచ్చామనుకోవద్దు బావా! మేమేదో చుట్టపుచూపుగా వచ్చాము. రేపు ఉదయాన్నే వెళ్ళిపోతాము. నువ్వూ, నీ పొలాలు క్షేమంగా ఉంటే మాకదే చాలు!"

"చూడు శోభా! వితండవాదమని ఆదిలోనే కొట్టిపారేస్తే నేనేమి చెప్పలేను. వినదగు నెవ్వరు చెప్పిన – అన్నారు. శ్రద్ధగా వినాలి నువ్వు. అలాగని నేను గహనాతి గహనమైన విషయమేమి చెప్పబోవడం లేదు..."

"ఉపోద్ఘాతం చాల్లే బావా! నేనేమో సావధానంగానే ఉన్నాను" వేగిరించింది శోభ.

"మానవులు కూపస్థ మండూకాల్లా బ్రతికిన రోజులు కాలగర్భంలో కలిసిపోయాయి. ప్రతి సామాన్య మానవుడి బ్రతుకులోనికీ కాంతినీ, శాంతినీ, తేవాలన్న ప్రయత్నాలు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈ మార్పు నీ కళ్ళకు కనిపించడం లేదా శోభా?"

"మూర్ఖురాలననండీ బావగారూ! మరికొంత వివరంగా సెలవివ్వాలి....."

"అందమగు చోట సర్వమూ అందమే శోభా! ఉడుకుమోత్తనంలో కూడా నువ్వు భువన మోహనంగా ఉన్నావు" ఓపింతసేపు గలగలా నవ్వేశాడు ప్రకాశం.

ఈసారి మరింత నెమ్మదిగా ప్రారంభించాడు ప్రకాశం. "వివరంగానే చెబుతాను శోభా! ఈ చెట్టుంది. ఇది ఎక్కడైతే పుట్టిందో, ఏ భూమిలోనుంచీ సత్తువను పీల్చుకుని పెరిగి పెద్దదైందో, ఆ భూమికే తన నీడను ప్రసాదిస్తోంది. ఈ మాత్రం నిజాయితీ లేకపోయిన తరువాత మానవుణ్ణి ఏమనాలో నాకు తోచదు. నీతోడి వాళ్ళ బ్రతుకులోకి ఇంచుక కాంతి తేలేకపోయిన తర్వాత నువ్వు చదివేం లాభం? నీ చుట్టూరా ఉన్నవాళ్ళని అసహ్యించుకుని, వాళ్ళకు దూరంగా వైదొలగి కూర్చుంటే ఇక నీ సంస్కారానికి ఎక్కడి మూల్యం? చూడు శోభా! మా నాన్న ఇక్కడే బ్రతికాడు. మా తాతయ్య ఇక్కడే బ్రతికాడు. వాళ్ళు తాముతిన్నారు. పదిమందికీ పెట్టారు. వాళ్ళెలా బ్రతికారు? ఈ భూదేవిని నమ్ముకునే బ్రతికారు. తనను తీసుకెళ్ళి పరులకు అమ్ముకోవద్దని కవితో మొరపెట్టుకున్నదట సరస్వతి. రైతుబిడ్డ ఊరువదలి పెట్టి దేశాలపై బడితే భూదేవి మాత్రం కంట నీరు పెట్టుకోదా శోభా?"

"అలాగైతే కలుగులో ఎలుకలాగ రోజులు వెళ్ళదీయడమే నీ జీవితానికి పరమార్థమా బావా?"

"అదిగో, నాకూ నీకూ పేచీ రావడమల్లా అక్కడే శోభా! కలుగులో ఎలుకలా బ్రతకడం కాదు. ఆధునిక విజ్ఞానం మానవుడికి ప్రసాదించిన వరాలను మోసుకొచ్చి పల్లెసీమను వెలుగు వెల్లువల్లో ముంచడమే నా ధ్యేయం. మా తాతయ్య ఈ బావి క్రింద 'రామన్న రామా' అన్న పదం పాడుకుంటూ తొలి కోడి కూతనుంచీ మధ్యాహ్నం ప్రొద్దు తిరిగేదాకా మోట తోలుకునేవారు. కాని మర నొక్కగానే పాతాళగంగను పైకి తీసుకొచ్చే విద్యుత్తు నాకిప్పుడిక్కడ సేవలు చేస్తోంది. అక్కడ మీ పట్టణంలోనే కాదు, ఇక్కడ మా మేడలో కూడా రేడియో పాడుతుంది. ప్రపంచ వార్తల్ని మోసి తెచ్చే దినపత్రిక ఉదయం నేను లేవకముందే కిటికీ గుండా నా గదిలో పడుతుంది. మా ఊళ్ళో యువజన సంఘముంది. రీడింగు రూముంది. పిల్లలాడుకునే పార్కుంది. చేయవలసిన పనులింకా చాలా ఉన్నాయని మాకు తెలుసు. రోము నగరం ఒక్కరోజులోనే నిర్మింపబడిందా శోభా? వేదికపైన నిల్చుని ఆడవాళ్ళకు హక్కులవసరమని ఉపన్యాసం వర్షిస్తే సరిపోయిందా శోభా? ఇక్కడికి వచ్చి చూడు, దరిద్రం వల్లనైతేనేమి, తరతరాల నాటి సంకుచిత సాంసారిక వాతావరణం వల్ల నైతేనేమి, మ్రగ్గిపోతున్న ఆడవాళ్లకు కాస్తా ఉల్లాసాన్ని కలిగించు. తీరిక సమయాల్లో వాళ్లకు వ్రాయడానికీ, చదవడానికీ నేర్పించు. మానవ సేవ అన్న పేరుతో నేను డాబులు చెబుతున్నాననుకుంటున్నావా శోభా? ఆ విధంగా లోక ప్రతారణం చేయవలసిన అవసరం నాకేమీ లేదు. ఈ జీవితంలో నా కానందం ఉంది. ఉట్టిలో వెన్న ఉండగా నెయ్యికోసం ఊరిపైకి బయల్దేరిన వాడిని ఏమంటారు? పిచ్చివాడంటారు. నేను పిచ్చివాణ్ణిగా చలామణీ కావడమే నీ అభిమతమా శోభా?"

"ఎందుకులే బావా! నీ మనసులో వున్న ఉద్దేశం వేరు. తెగేదాకా లాగితే తాడు తెగిపోతుందని నీకు తెలుసు. నువ్వదేపని చేస్తున్నావు..."

ప్రకాశం నిర్ఘాంతపోయాడు. "తెట్టతేరకు అభాండం కూడానా శోభా! అవసరం వచ్చింది కనుక తేట తెల్లంగా నా మనసు ఆవిష్కరించుకొంటున్నాను. ఇక్కడ నీకు

విరుద్ధమైన శక్తులేవీ పనిచేయడం లేదు. మా అమ్మకు నువ్వంటే ప్రాణం. ఇక చంద్రం సంగతి సరేసరి. ఎటొచ్చీ నేనే కాస్త చెడ్డవాణ్ణి. పట్టిన కుందేటికి మూడేకాళ్ళనడం నా స్వభావం".

"ఆ మొండితనంలో మా నాన్నగారు మాత్రం నీకు తీసిపోతారనుకుంటున్నావా బావా?"

"మామయ్యకు స్వంత అభిప్రాయాలు కూడా ఉన్నాయా శోభా? అత్తయ్య ఎటు మొగ్గితే ఆయనటే మొగ్గేస్తాడు. ఉత్త పుణ్యానికి ఆయనను తీసుకొచ్చి మధ్యలో ఇరికించడం అన్యాయం..."

"ఇంతదూరం వచ్చాక చెప్పక తప్పుతుందా బావా? ఈ ఊరు నా పాలిటికి చెరసాలలా కనిపిస్తుంది. నాకు సొసైటీ కావాలి. వినోదం కావాలి. ఈ మట్టి మనుష్యుల మధ్య బ్రతకడం నాచేత గాదు..."

ఒకటి రెండు గడియలకు మునుపే సూర్యుడస్తమించాడు. కానరాని ద్వారాల్లోంచి చీకట్లు పొంగి పొరలివచ్చి లోకాన్ని కావిలించుకుంటున్నాయి. ఇటు ప్రకాశమూ, అటు శోభా ఇద్దరూ కూడా చిన్నబోయిన ఆవనతవదనాలతో కదలకుండా కూర్చున్నారు.

"ఫ్లాస్కులో కాఫీ ఉంది. తీసుకోనేలేదా అన్నయ్యా!"

చంద్రం పలకరింపుతో తల పైకెత్తి "ఇప్పుడేం కాఫీ లేరా చంద్రం. నువ్వు శోభను ఇంటికి తీసుకెళ్ళు. నేనలా నిమ్మతోటదాకా వెళ్ళి కొనమడిలో నీళ్ళున్నాయో లేదో చూచివస్తాను" అన్నాడు ప్రకాశం.

ప్రకాశం ఇల్లుచేరుకునే సరికి ఎనిమిది గంటలైంది. కుర్చీ ఆరుబయట వేయించుకుని అతడి రాకకోసం వేచివున్నారు మాధవరావుగారు.

"కూర్చోరా ప్రకాశం. నీతో కొంచెం మాట్లాడాలి" ప్రకాశం లోపలికి రాగానే ఆయన ఉపక్రమించారు.

"భోజనమైన తరువాత తీరిగ్గా మాట్లాడుకోకూడదా మామయ్యా!"

భోజనాలయ్యేదాకా ఓపిక బిగబట్టుకున్నారు మాధవరావుగారు. ఆయన సాధారణంగా సంసారానికి సంబంధించిన విషయాలను గురించి తలపెట్టరు. తలపెడితే తాడోపేడో తేల్చుకునేదాకా నిద్రపోరు.

"పనులన్నీ వదలిపెట్టి నేనింతదూరం రావడమెందుకో ఎరుగుదువా ప్రకాశం?" మళ్ళీ ఆయన ముగ్గులోకి దిగేశారు.

"చెప్పకముందే తెలుసుకోడానికి నాకేమైనా జోతిష్యం తెలుసునా మామయ్యా!" ఆశ్చర్యం ప్రకటించాడు ప్రకాశం.

"తెలియదు గనుకనే చెబుతున్నాను. అవకాశాలు మనం దొరకమన్నప్పుడల్లా దొరకవు. దేనికైనా అదృష్టం కలసిరావాలి. ఇప్పుడు మనకు కలసివచ్చిందదే. ప్రారంభంలోనే రెండు వందలా యాభై రూపాయల జీతం. త్వరలోనే ప్రమోషను. చూద్దాంగీద్దామని తటపటాయించడానికీ వీల్లేదు. అపాయింట్‌మెంటు ఆర్డరు చేతికి వచ్చినట్టేననుకో! నాలుగో నాటికల్లా ఉద్యోగంలో చేరిపోవాలి...."

ప్రకాశం సాభిప్రాయంగా తల్లివైపు చూచాడు. "ఇల్లూ వాకిలీ వదలిపెట్టి ఉద్యోగానికి వెళ్ళవలసిన గ్రహచారం ప్రకాశానికి ఏ మొచ్చిందన్నయ్యా!" అంది పార్వతమ్మ.

"ఈ ఇల్లూ వాకిలీ రెక్కలు గట్టుకుని పైకెగిరి పోవుగాని, నువ్వూరుకో చెల్లెమ్మా!" అంటూ పార్వతమ్మ నోటికి తాళం వేసి "ఏమంటావు ప్రకాశం!" అని నిలదీసి అడిగారు మాధవరావుగారు.

"అనడానికేముంది మామయ్యా! అమ్మ చెబుతున్నమాట కూడా అంత తేలిగ్గా కొట్టి వేయదగింది కాదు..."

"మిగిలినవాళ్ళ మాటల్ని మాత్రం పూచికపుల్లకన్నా హీనంగా తీసి పారవేయవచ్చు నట్రా ప్రకాశం! మాదేం పోయింది గానీ నువ్విక్కడే ఊళ్ళేలు. చెప్పడం నా బాధ్యత కనుక, ఇంతదూరం పనిగట్టుకుని వచ్చానుగానీ, నువ్వీ మురికిదిబ్బపైన త్రుప్పుబట్టిపోతే మాకేమీ ఇబ్బందిలేదురా అబ్బాయీ! ఒరే చంద్రం ఆ డ్రయివరు ఎక్కడ పడివున్నాడో చూడు. లేసి కూర్చోబెట్టి ఉదయం నాలుగింటికే బయల్దేరాలని చెప్పు...."

నిశ్చింతగా వాలు కుర్చీలోనే నిద్రపోయారు మాధవరావుగారు.

## 2

"మా అమ్మాయి నీకు చేదైపోయిందటగా ప్రకాశం. పోనీలే నాయనా! మాకు తగిన సంబంధాలు మాకు దొరక్కపోవు..." రుసరుస లాడింది అత్తయ్య.

ఆవిడ కేమని బదులు చెప్పాలో తోచక ప్రకాశం నవ్వుకున్నాడు. అచ్చమైన అబద్ధాన్ని తిరుగులేని సత్యంలా చెప్పగలగడం అత్తయ్యకే చెల్లు. ఆమెతో వాగ్వాదానికిది సమయమూ కాదు, సందర్భమూ కాదు.

ఇల్లంతా హడావిడిగా ఉంది. దేశీయ, విదేశీయ జంత్రవాయిద్యాల కలగలుపు సినిమా సంగీతం మాధవరావుగారి మేడలో జరుగుతున్న సంబరానికి చౌకగా తయారై అనన్య ప్రచారం సాధించిపెడుతోంది. ద్వారాలకు మామిడాకుల తోరణాలు, విందు జరగబోతున్న హాల్లో పైకప్పు కనిపించకుండా రంగు కాగితాల అలంకారాలు. మేడ క్రిందికీ పైకి చెడతిరుగుతున్న నౌకర్లు! ఈ సందడికంతా తలమానికం అత్తయ్య. ఆవిడ సర్కసు ప్రదర్శనంలో మేనేజరులా ఇల్లంతటా తానై వీరవిహారం చేస్తోంది. "ఒరే రాయుడూ! తివాసీ ఎక్కడ? ఓసేవ్ సుబ్బలక్ష్మీ! వెండి గ్లాసులేవీ? అయ్యా గుమాస్తాగారూ, కిళ్ళీలకు ఆర్డరిచ్చారా, లేదా? అదేమిటి ప్రకాశం! నీకెందుకు నాయనా నిలువుగాళ్ళ శిక్ష? ఏదో ఓపరికరం లేకపోయినా ఇలా అల్లాడుతున్నాను. అల్లాడకపోతే మాకెవరున్నారు? ఇదిగో సుబ్బలక్ష్మీ! ఇంటికొచ్చిన బంధువుకు కాఫీ తీసుకొచ్చి ఇవ్వాలని తెలియదూ నీకు? నువ్వెక్కడ పెడితే అక్కడ శిలావిగ్రహమైపోతావే బంగారు తల్లీ! మొదట ఓ లోటానిండుకు కాఫీ తీసుకొచ్చి ప్రకాశానికివ్వు. మందీ మార్బలం లేనివాళ్ళం బాబూ, మర్యాదలు సరిగ్గా జరగలేదనుకోకు...."

అత్తయ్య పట్ల సానుభూతి మాత్రమే కలిగింది ప్రకాశానికి. ఆవిడ మరేం చేస్తుంది? బోలెడు ఆస్తిపాస్తులు, కలలోనైనా ప్రాతికూల్యం ప్రకటించని భర్త. ఒక్కగానొక్క కూతురు. ఆ కూతురు ముద్దూ ముచ్చటలు ఆవిడగాకపోతే మరెవరు చూస్తారు?

సుబ్బలక్ష్మి లోటానిండుకూ కాఫీ తీసుకొచ్చింది. పంచకోల కషాయంలా ఉన్న కాఫీని అవలీలగా జుర్రేశాడు ప్రకాశం. ఈ కాఫీ ఏనాడు పుట్టిందో తెలియదు. ప్రభవించిన చోట నదులు నిర్మలంగా ఉన్నట్టే. ఈ కాఫీ కూడా ఆదిలో శుచిగానూ, రుచిగానూ ఉండిఉంటుంది. కాలక్రమాన తీపి తగ్గిపోయిన కొద్దీ, అంతకంతకూ హెచ్చిపోతున్న చేదే మానవుడి జిహ్వాకు పరమ రుచ్యంగా పరిణమిస్తోంది.

ప్రకాశం మళ్ళీ ఒకసారి విరాగిలా తనలో తానే నవ్వుకున్నాడు.

పోర్టికోలో కారాగింది. వచ్చినవాడు మామయ్య, తెచ్చినవి పెద్ద పెద్ద బుట్టలు. హాల్లో ఓ మూలగా వేసివున్న కుషను కుర్చీలో కూర్చున్న ప్రకాశానికి ఆ బుట్టల్లో ఏముందో తెలుసుకునే అవకాశమెక్కడ? కానీ ఆ ఉన్న గుండె జబ్బేదో మామయ్యకే ఉంది. చిన్న చిన్న విషయాలకంతా సస్పెన్సును పరిపోషించి ఆయన ఎదుటివారికి గుండెజబ్బు తెచ్చిపెట్టడు. మూతలు వూడదీసి తెచ్చినవాటిని గంభీరంగా ప్రదర్శిస్తున్నాడు మామయ్య.

ముక్కుమీద వేసుకున్న వ్రేలిని వెనక్కు తీయలేక పోయింది అత్తయ్య. "పూలా! ఉండండుండండి బాబూ! మూడు బుట్టల నిండుకూ పూలేనా? బజారులో ఇంక పువ్వులు లేవటండీ! అయితే చేస్తున్న వ్యాపార సాపారాలన్నీ వదలిపెట్టి టోకుగా పూలవ్యాపారం ప్రారంభిస్తారటండీ? ఉత్సవ సమయాల్లో మూలవిరాట్టుకు వేసేపాటి పుష్పహారాలు రెండా? ఇవి చాలక చిన్నసైజువి ఒక డజనా! పైగా సాదా పూలసరాలు ఓ బుట్టెడా? పూల పల్లకీ కట్టించుకుని మనమిద్దరమూ ఊరేగుదామనుకున్నారా ఏమిటండీ? అయ్యోరామా! ఈయనేం మనిషమ్మా!"

మామయ్య ముఖాన కత్తివేటుకు నెత్తురు చుక్కలేదు. ఒకవేళ తను చేసింది పొరబాటేమోనన్న సందేహం ముఖంలో ప్రతిఫలించి ఆయన వాలకాన్ని దీనాతిదీనంగా మార్చివేసింది. అత్తయ్య తుఫానులా విరుచుకుపడితే సంజాయిషీ చెప్పుకోడానికి మాటలు స్ఫురించవంతేగాని, ఇది మామయ్య పెద్దగా ఆలోచించిన తర్వాత చేసిన పనై ఉండదు. బహుశా బజారుగుండా వెళ్తూ అంగళ్ళలో పువ్వుల్ని చూచి ఉంటాడు మామయ్య. తానింట్లో సరదాగా అమ్మాయికి పుట్టినరోజు పండుగ జరుపుకుంటూ వుండగా పువ్వులు బజారులో ఎందుకుండాలి – అన్న ధర్మ సందేహం కలిగి ఉంటుందాయనకు.

కానీ అత్తయ్యకూడా పట్టువిడుపులు తెలియని మనిషి కాదు. తీరా తెచ్చిన తర్వాత నచ్చలేదని వాపసు చేసి వేరేవాటిని పంపమని చెప్పడానికి ఇవి చీరలూ, నగలూ కావు. ఆమె వెంటనే తన ధోరణికి సవరణ ఆపాదించుకుంది. "తెస్తే తెచ్చారుగానీ అందుకోసం దిగాలుపడి నిల్చిపోతారటండీ. వేడుకకొక వెల ఉందా ఏమిటి? ఆ మాటకొస్తే పప్పులేని పెళ్ళా, పువ్వులులేని సంబరమా, ఒరేయ్ రాముడూ ఈ పుష్పహారాన్ని తీసుకెళ్ళి దర్వాజాకు తగిలించరా, ఈ పూలదండలు తీసుకెళ్ళి పటాలకు వేసుకోవే సుబ్బలక్ష్మీ....."

కొండలా ఎదురైన ఇక్కట్టు మంచులా విడిపోతే ఎవరికి మాత్రం ఆనందం కలుగదు? మామయ్య ముఖం కలకలలాడింది.

"మీ పుణ్యానికి మీరిక బజారుకు వెళ్ళింది చాలుగానీ కుర్చీ వేయించుకుని గుమ్మం దగ్గర కూర్చోండి. ఆరింటి కల్లా అతిథులొక్కరొక్కరే వస్తారు. అన్నట్టు మొదటి అతిథి ఎప్పుడో వచ్చేశాడండోయ్! మీ అవస్థలో మీరు చూచారేకాదు...."

"ఏదీ, ఎక్కడ! ఎవరు?" కళ్ళజోడును సర్దుకొనే తొందరలో పైకప్పుకేసి చూస్తూ అడుగుతున్నాడు మామయ్య.

"ఇదిగో, ఇక్కడున్నాను మామయ్య! భూమిపైన" అన్నాడు నవ్వుతూ ప్రకాశం.

"ఊహూ, భూమిమీదనే ఉన్నావట్రా ప్రకాశం! బలేవాడివిరా నువ్వు!" ఆపాదమస్తకం ఊగిసలాడిపోతూ విరగబడి నవ్వేశాడు మామయ్య.

మామయ్యపట్ల జాలిమాత్రమే కలిగింది ప్రకాశానికి! భార్యవిధేయత కృష్ణ భగవాను దంతటి వాడికే తప్పింది కాదు. ఆ మాటకేమి గానీ హృదయంలో చంద్రహాసం ఉంచుకుని,

పెదవిపైన మందహాసం మెరిపించడం ఆయన చేతకాదు. లోపలా బయటా ఆయన ఒకే మనిషి. కోపమో, తాపమో, ఖేదమో, మోదమో ఎప్పటికప్పుడు మనోకాసారంలో ప్రేరేపించిన భావాలను ఎదుటివారిపైన కుండలతో కుమ్మరించి ఆయన మళ్ళీ మామూలు మనిషైపోతాడు.

"వచ్చినవాడివి, కాళ్ళూ చేతులు ముడుచుకుని ఇక్కడ కూచున్నావా ప్రకాశం! ఈ వినోదం నీదిమాత్రం కాదూ? వెళ్ళు వెళ్ళు మేడపైకి వెళ్ళి కాసేపు రెస్ట్ తీసుకో...."

మెట్లెక్కి మెల్లగా మేడపైకి వెళ్ళాడు ప్రకాశం. అతడి పాదాలు అప్రయత్నంగా శోభాదేవి గది ఎదుట ఆగిపోయాయి. అప్రయ్నతంగానే అతని చేతులు రెక్క తలుపుల్ని తెరిచాయి. ద్వారానికి నేరుగా గోడకానించి ఉన్న నిలువుటద్దానికి అభిముఖంగా కూర్చొని తిలకం దిద్దుకుంటూ ఉంది శోభ.

వచ్చిన వ్యక్తిని ప్రతిబింబంగా అనువదించిపెడుతున్న నిలువుటద్దంలోకి సూటిగా చూస్తూ "వచ్చావా బావా!" అంది శోభ.

"వచ్చాను శోభా" అన్నాడు ప్రకాశం.

"సంతోషంగా ఉంది బావా" క్షణం సేపు ఆగి "నువ్వు రావడం" అంటూ పూర్తి చేసింది శోభ.

"ఆనందంగా ఉంది శోభా!" రెండు క్షణాలు ఆగి "నువ్వలా చెప్పడం" అంటూ ముగించాడు ప్రకాశం.

అమ్మ క్షేమంగానే ఉంది శోభా! చంద్రం నిన్ను మరి మరీ అడిగినట్టు చెప్పమన్నాడు- అంటూ కుశలవార్తలు చెప్పుకుందామనుకున్నాడు ప్రకాశం.

"అమ్మాయ్ శోభా! జయప్రద వచ్చేసింది" క్రిందినుంచీ ధనుర్ముక్తమైన బాణంలా పిలుపుపరతెంచి వచ్చింది.

"ఏదీ, ఎక్కడ వచ్చేశావా జయప్రదా" ఒక్క పరుగులో మెట్లుదిగుతోంది శోభ.

జయప్రద పూలరెమ్మ, ఆరడుగులుండదు గానీ, ఉన్నట్టే కనిపిస్తుంది. శరత్కాలమేఘం కైవడి వినీల గగనంలో తేలిపోతున్న అప్సరసలా ఆమె తెల్లటి షిఫాన్ చీరకట్టుకుంది. కుటిల కుంతలాల పైనుంచి చెవుల కడ్డంగా క్రిందికి తీసి నీలి రంగు సిల్కు మఫ్లరు బిగించింది. ముద్ద మందారాల లాంటి ముచ్చటైన అరుణాధర లామెవి; శోభాదేవి ఆఖరు మెట్టుపైన ఉండగానే తామరకాడల్లాంటి బాహువులను సాచి జయప్రద ఆమెను తన కౌగిల్లోకి తీసుకుంది "ఎలాంటి మొగుడు దొరుకుతాడోగానీ పట్టపురాణీలా ఉన్నావే శోభా!" అంటూ స్నేహితురాలి బుగ్గల్ని చుంబించింది.

"వన్ మినిట్, వన్ మినిట్. కదలకుండా నిల్చో శోభా! మీరిందాకా ఉన్నట్టే ఉండండి జయప్రదాదేవి గారూ!" మెడకు తగిలించుకున్న తోలుపెట్టెలోనుంచీ కెమెరాను పైకితీస్తూ తుమ్మెదరెక్కల వంటి నూనూగు మీసాల కుర్రాడు, పైజామా పైన లాల్చి వేసుకున్న స్ఫురద్రూపి హాల్లోకి వచ్చేశాడు.

"ఎందుకైనా మంచిది! ఒకటి రెండు ఫోటోలు తీసేయవయ్యా చక్రపాణీ!" కిటికీలోంచి హెచ్చరిస్తోంది అత్తయ్య.

"రైటో రైటో" అంటూ కెమెరా క్లిక్ మనిపించాడు చక్రపాణి "ప్రథమ కబళంలోనే మక్షికాపాతంలా (?) వచ్చీ రాగానే అద్భుతమైన దృశ్యం ఎదురైందండీ జయప్రదగారూ! ఎన్‌లార్జ్ చేయించి మీకిద్దరికీ చెరొక కాపీ బహూకరిస్తాను..." కెమెరాను యథాస్థానంలో పదిలపరచుకుంటూ అన్నాడు చక్రపాణి.

అంతలో వేరొక గెస్ట్ ద్వారం దగ్గర ప్రత్యక్షమయ్యాడు. టాక్సీలోనుంచీ క్రిందికి దిగి ఠీవిగా అడుగులు వేస్తూ ద్వారానికడ్డంగా సిల్హెట్‌లా నిల్చున్న అగంతకుడు ముప్పై యేళ్ళవాడు. పూర్తిగా ఆధునికమైన వేషం అతనిది. కర్ణుడికి అతడి కవచమైనా అంత పొందికగా అమరి ఉండదు. నీలిరంగు పాంటు దానిపై మోకాళ్ళదాకా వ్రేలాడుతున్న కోటు, త్రిప్పిపెట్టిన 'వి' లాగా ముకుపుటం క్రిందినుంచీ ఏటవాలుగా క్రిందికి దిగిన చురకత్తి మీసాలు, కళ్లకు నల్లద్దాల సులోచనాలు, నుదిటీపైకి జారి గాలికి కదులుతున్న ముంగురులు. పెదవుల మధ్య నిర్విరామంగా కాలుతున్న సిగరెట్టు....

కోర్టులో సాక్షిని పిలిచినట్టుగా వసారాలో నుంచీ అనౌన్స్ చేస్తున్నాడు మామయ్య– "శచీంద్రబాబు. శోభా, శచీంద్రబాబు వచ్చేశాడు....."

అత్తయ్య స్వయంగా వెండి గ్లాసులో కాఫీ తీసుకొచ్చింది. శోభ ఆసనం చూపించింది. మామయ్య టేబిల్ ఫాను తెచ్చి అతనికి దగ్గరగా పెట్టమన్నాడు. ఉపచారాల పట్ల సమ్మోదాన్ని ప్రకటిస్తున్న మందస్మితంతో శచీంద్రబాబు పాతకాలంనాటి భారీకుర్చీలో సుఖాసీనుడై పోయాడు.

గంట ఆరున్నరై విద్యుద్దీపాలు వెలగగానే పుట్టినరోజు పండుగకు ఉత్తేజం సమకూరినట్టయింది. కార్లు, రిక్షాలు, మోటారు సైకిళ్ళు ఒక్కొక్కటిగా వచ్చి మేడ యెదుట నిలుస్తున్నాయి. హాల్లో అతిథుల కలకలం ఉధృతమౌతోంది. గిరజాలు పెంచుకుని, శుభ్రంగా మీసాలు గొరుక్కుని, భుజాలపైనుంచీ పాదాలదాకా పచ్చటి శాలువాను దిగవిడుచుకున్న ఒకానొక కవి కుమారుడు నలుగురు మిత్రుల్ని ప్రోగు చేసుకుని స్వీయ కవితాగానం చేస్తున్నాడు. అరవై యేళ్ళ వృద్ధు డొకాయన ఇటీవల తాను హాజరైన పెళ్ళిలో జరిగిన విందును గురించి నోరూరగా జవులు పుట్టగా ముచ్చటిస్తున్నాడు. వరండాలో నుంచీ మామగారి మాటలు శ్రావ్య నాటికలా వినిపిస్తున్నాయి. "నువ్వుకూడా ఆలస్యం చేయాలటయ్యా సుగుణాకరం? ఈ మధ్య ఏదో అరవ చిత్రాన్ని తెలుగులోకి దించటానికి ప్రయత్నాలు చేస్తున్నావటగా! శోభ చెప్పింది. ఓహోహో, విశ్వనాథం గారా, నెల రోజులుగా తమ దర్శనాలే లేవు. మీ అబ్బాయికి నాగపూరు బదలీ అయిందటగా, చెప్పారే కారు. చెప్పకపోతేనేం లెండి, ఆసక్తి వుంది కనుక తెలుసుకోడానికి తంటాలు పడుతూ ఉంటాం.... రావమ్మా ఉషా, ప్రొద్దుపోయి చీకటిపడుతుండగా మా ఇంటికి ఉషస్సు వచ్చేసిందండోయ్..."

మామయ్య హితవు ప్రకారం కాసేపు రెస్ట్ తీసుకుంటే బాగుండుననిపించింది ప్రకాశానికి, కాళ్ళీడ్చుకుంటూ అతడు డాబా పైకి వెళ్ళాడు. పదిమందితో కలిసి మెలిసి ఉండగలడం భగవంతుడు ఇవ్వవలసిన వరం. తన కలాంటి వరం అనుగ్రహింప బడలేదు. లేకపోతే బోలెడుమంది అతిథులు కులాసాగా కాలక్షేపం చేస్తూండగా తనిలా ఏకాంతాన్ని అన్వేషించేవాడు కాదు.

## 3

ఎనిమిది గంటలకు సరిగ్గా క్రిందకి దిగివచ్చాడు ప్రకాశం. కిటకిటలాడిపోతున్న అతిథులతో, ఒక్కుమ్మడిగా చెలరేగుతున్న కోలాహలంతో, కప్పునుంచీ వ్రేలాడుతున్న పూలదండలతో, అగరువత్తుల సువాసనలతో హాలు హాలంతా పుష్పక విమానంలా ఉంది. చప్పున కనిపించడం లేదు గానీ ఇంత హాల్లో తనకొక సీటు ఖాళీగా ఉండకపోదు. వారగా నిల్చుని చుట్టూరా కలయ పరికిస్తున్నాడు ప్రకాశం.

వెనుకవైపు నుంచి చిరపరచితమైన కంఠం వినిపించింది. పిలుస్తున్నవాడు శేఖరం.

ప్రకాశానికి ప్రాణం లేచి వచ్చినట్టయింది. కాలేజి సహపాఠకుల్లో తననింకా జ్ఞప్తిలో ఉంచుకున్న నలుగురైదుగురు మిత్రుల్లో శేఖరం ఒకడు.

"రావోయి ప్రకాశం! నాటికీ నేటికీ లేట్ లతీఫ్‌వి రా సోదరా నువ్వు! సర్దుకుని అర్ధ సింహాసన మిస్తున్నాను గానీ కూర్చో" ఆప్యాయంగా ఆహ్వానించాడు శేఖరం.

"అర్ధ సింహాసనానికైతే సమ్మతిస్తున్నాను గానీ, విందులో అరిటాకు మాత్రం ప్రత్యేకంగానే వేయించు శేఖరం!" కూర్చుంటూ అన్నాడు ప్రకాశం.

విందు ప్రారంభమైంది. తీపీ, కారం, చిత్రాన్నం, చక్కెరపొంగలీ, వడా పాయసం వరుసగా విస్తర్లోకి వచ్చి, రాగానే మాయమైపోతున్నాయి. శేఖరం భోజన పరాక్రమ ప్రదర్శనానికి ఉద్యమించిన అవకాశాన్ని పురస్కరించుకుని హాల్లో సమావిష్టులైన బంధు మిత్రులవైపు పరిశీలనగా చూడసాగాడు ప్రకాశం. బాహ్యదృష్టికి అక్కడొక విందు జరుగుతున్నట్టే కనిపించినా, విందుకు వెనుక నిజాని కక్కడొక పందెం ప్రారంభమైనట్టుగా భాసించడంతో ప్రకాశం నివ్వెరపడిపోయాడు. ప్రతి వ్యక్తీ ఎదుటివారిని తన వైపుకు ఆకర్షించుకోవాలన్న ప్రయత్నంలో తలమునకలై ఉన్న ఆ సంరంభం మధ్య ప్రకాశం కొంతసేపు చేష్టలు దక్కి స్థాణువులా ఉండిపోయాడు. వేషంతో కొందరు, మాటలతో కొందరు, హావభావాలతో కొందరు మొత్తంపైన అందరూ అలాంటి ప్రయత్నాల్లోనే నిమగ్నులై ఉన్నారు. అసలు సమస్య అక్కడే ఉద్భవించింది. అందరూ వక్తలైతే శ్రోతలెవ్వరు? అందరిదీ ప్రదర్శనమే అయితే ప్రేక్షకులెవ్వరు?

ఆకు ఖాళీచేసి శీతల పానీయాలకోసం కాచుకుని కూర్చున్న వ్యవధిలో ప్రశ్నించాడు శేఖరం – "నువ్వు జయప్రదాదేవి పాటకచ్చేరీ కూడా వినదలచుకున్నావా ప్రకాశం?"

"ఆవిడ పాడుతుందా ఏమిటి?" అన్నాడు ప్రకాశం.

"ఇంకా నయం! ఆవిడ గాకపోతే నువ్వూ నేనూ పాడుతామా ప్రకాశం! ప్రాధేయ పడవలసిన అవసరంలేదు. ఆసక్తిని అభినయిస్తే చాలు. పాటకు వినిమయంగా ఆమె ఆశించేదేమిటో తెలుసా ప్రకాశం? డబ్బు కాదు. కావలిస్తే తండ్రిగారి ఖాతాలో శ్రోతలకు భోజనాలు పెట్టించి, స్వంత ఖర్చుతో కిళ్ళీలు, సిగరెట్లు తెప్పించి హాయిగా వినిపొమ్మని ఆలాపన మొదలు పెడుతుంది జయప్రద. ఆమెకు కావలసిందల్లా ఇంచుక పొగడ్త. ముఖస్తుతి అయినా ఇబ్బంది లేదు. నువ్వెప్పుడైనా గణాచారిని చూచి ఎరుగుదువా ప్రకాశం! గణాచారికి మొగుడుండడు. తనవాళ్ళపైన మమకారాలుండవు. తనేమిటో తన నావహించిన అలౌకిక వాతావరణ మేమిటో, ఆవిడదొక ప్రత్యేక ప్రపంచం. జయప్రద సంగీత దేవతచేత ఆవేశితురాలు. తండ్రి ఆమెకెప్పుడో పెళ్ళిచేశాడు. ఆ భర్త తిండీనీళ్ళలాంటి ప్రాణావసర విషయాలకే ప్రాధాన్యమిచ్చి, సంగీత సాహిత్యాలను అడపా దడపా కాస్తో కూస్తో సేవించే మామూలు రకం మనిషి. మరి కళంటే ఏమిటో నీకు తెలుసు కదా ప్రకాశం! అది లౌకికమైన నిబంధనల నన్నింటినీ నుగ్గు నూచం చేసి ఆకాశవీధుల్లో బలాదూర్లు తిరుగుతుంది. జయప్రద విషయంలోనూ అంతే జరిగింది...."

అంతలో పానీయాలు కూడా వచ్చేశాయి.

"నువ్వింతగా చెప్పిన తరువాత నాకేమో జయప్రద సంగీతం వినాలనే ఉంది శేఖరం! కానీ ఈ తలనొప్పి ఒకటి నన్ను దారుణంగా వేదిస్తోంది. బయటికి వెళ్ళి కొంతసేపు చల్లటి గాలిలో తిరిగి వద్దామనుకుంటున్నాను..." అన్నాడు ప్రకాశం.

"అరెరే, అది మన అయిడియా! నీకెలా తట్టింది ప్రకాశం! వెళ్దాం పద" అంటూ తనే ముందుగా బయల్దేరేశాడు శేఖరం. బయల్దేరుతూ బంగళా ఆవరణలో గంగరావిచెట్టు క్రిందలి సిమెంటు దిన్నెలపైన పవ్వళిస్తే శిరోభారంతోబాటు భుక్తాయాసం కూడా యిట్టే ఉపశమిస్తుందని తన రెండో అయిడియా కూడా బయట పెట్టేశాడు.

గంట తొమ్మిదైంది. హాల్లో పాటకచ్చేరీకి ఏర్పాట్లు జరుగుతున్నాయేమో, అతిథులు వసారాలో మూగిపోయారు. జయప్రదాదేవి భర్తకు మల్లే సంగీతమంటే అంతగా పట్టింపులేని వాళ్ళు కొందరు మామయ్య దగ్గర సెలవు తీసుకుని ఇళ్ళకు వెళ్ళిపోతున్నారు. కాళ్ళూ చేతులూ బారగిల చాపుకుని అరుగుపైన వెల్లకిల పడుకున్న శేఖరం ఒకటి రెండు గడియలసేపు నిశ్శబ్దంగా గడచిపోయిన తరువాత హఠాత్తుగా ప్రసంగానికి శ్రీకారం చుట్టాడు.

"నువ్వెప్పుడూ ఇతరుల అభిప్రాయాలను తారుమారు చేస్తుంటావు ప్రకాశం! ఈ ఫంక్షనుకు నువ్వు రావేమో ననుకున్నారు. హాల్లో కనిపించేదాకా నేనుకూడా నువ్వు రాలేదేమో ననుకున్నాను..."

"అలాగా శేఖరం! రాకపోవడానికి నాకట్టే పెద్ద కారణమేమీ కనిపించలేదు. పోగా నా భయాలు కూడా నాకున్నాయి. సంబంధం బెడిసిపోయింది కనుక ఈ సమయంలో హాజరు పలుకకపోతే నేను బొత్తిగా కుళ్ళుమోతు క్రింద లెక్కింపబడతానేమో ననిపించింది...."

"ఓహో, అదా నీ ధర్మసందేహం!" పకపక నవ్వేశాడు శేఖరం. "ఎలాగైతేనేం ప్రకాశం, మీ అత్తయ్య కోరిన కోనలో వాన కురిసింది. నువ్వు గనుక గైర్ హాజరైవుంటే ఈ ఘోషయాత్ర బూడిదలో పోసిన పన్నీరై మీ అత్తయ్య మనసుకెంతో బాధ కలిగి ఉండేది...."

"నా మూలంగా అత్తయ్య కామాత్రం సంతృప్తి కలిగితే నాకంతకంటే కావలసిందేముంది శేఖరం!" ఆలోచిస్తూ అన్నాడు ప్రకాశం.

నీటి ఆవిరిని విరజిమ్మడానికి ముందుగా స్టేషనులోకి వచ్చి ఆగిన రైలుబండిలా తటాలున లేచి కూర్చున్నాడు శేఖరం "నువ్వొక్కడివే కాదు ప్రకాశం! మీ అత్తయ్యకు సంతృప్తిని చేకూర్చే మహోద్యమంలో నీలాంటి వాళ్ళింకా ఎందరో ఉన్నారు. ఏ ఒకరిద్దరో తప్పా మిగిలిన వాళ్ళందరూ ఈ సంబరానికి వచ్చేశారు. ఎందరో మహానుభావులని ఊరికే అన్నాడా త్యాగరాజు! అందరిని గురించీ వాకొనడం నా చేతనయ్యే పని కాదు. ముచ్చటగా ముగ్గురిని గురించి మాత్రం ముక్తసరిగా ముచ్చటిస్తాను. పురాణంలో ఈ పిడకల వేటేమిటన్న సందేహం కలగవచ్చు నీకు! తీర్థానికి వెళ్ళొచ్చిన తరువాత అక్కడేం చూచావన్న ప్రశ్నకు బదులు చెప్పడానికైనా ఒకటి రెండు విషయాలు తెలుసుకోవడం అవసరం. పైగా జాబితాలోనుంచి తొలగింపబడ్డావు కనుక, ఇంకా జాబితాలో ఉన్న వాళ్ళని గురించి తెలుసుకోవాలన్న కుతూహలం నీకుండకపోదు. మొదట చక్రపాణిని గురించి చెబుతాను..."

"చక్రపాణి అంటే ఆ ఛాయాచిత్ర గ్రాహకుడేనా శేఖరం!"

"శ్రమపడ్డావుగానీ, నీ అనువాదానికి నా సానుభూతి! నా మట్టుకు నేను అతడొక ఉపగ్రహం అంటాను. ఈ ఉపగ్రహం జయప్రదను ముఖ్యగ్రహంగా చేసుకుని ఆవిడ చుట్టూ పరిభ్రమిస్తోంది ప్రస్తుతం! ఎందుకూ అంటావు. ఎందుకో అంటాను! మరీ నొక్కి

అడుగుతావనుకో, నీళ్ళెందుకు ప్రవహిస్తున్నాయి. గాలెందుకు వీస్తుంది. అని ఎదురు రెట్టిస్తాను. ఆలోచించాలేగానీ సంజాయిషీలే తోచకపోతాయా ప్రకాశం! నువ్వు పలానా హోటల్లో కాఫీ తీసుకున్నానని చెప్పగలవు. పలానా బ్లేడుతో ముఖం గోక్కున్నానని చెప్పగలవు. అంత తేలిగ్గా పలానా అమ్మాయిని ప్రేమించానని బాహాటంగా చెప్పుకోగలిగేపాటి గుండె దిటవు నీకుండదు. నాకు తెలిసినంతలో అలాంటి గుండెదిటవు చక్రపాణికొక్కడికి మాత్రమే ఉంది. నా మాటమీద నీకు నమ్మకం లేకపోతే నువ్వు అతడి ఫోటో ఆల్బం చూడవచ్చు. అందులో చక్రపాణి ఎప్పుడెప్పుడు ఎవరెవరిని ప్రేమించినట్టుగా భావించాడో ఆ వివరాలన్నీ రూపభంగిమలతో సహా కన్పిస్తాయి. నువ్వు చక్రపాణిని చిత్రగ్రాహకుడన్నావు. అంతకన్నా బాహుకుడనడం సమంజసం! కర్కోటకుడు కరిచిన తర్వాత నలుడు వికార స్వరూపంతో బాహుకుడై పోతాడు. ఇక్కడ ప్రేమ అన్న మనో వికారానికి లోనై చక్రపాణి ఇలా తయారయ్యాడు. మన్నించు ప్రకాశం! ప్రేమ అన్న పదానికి నేను తీరని అపచారం చేసినట్టు నువ్వు భావించవచ్చు. కానీ వాస్తవమేమిటంటే అంచులు అరిగిపోయి, అక్షరాలు మాసిపోయిన రూపాయి నాణానికి మల్లే ప్రేమ అన్న పదానికిక్కడ సాంఘిక వ్యవహారంలో మారకపు విలువలు లేవు. పదమంటే ఏమిటి ప్రకాశం! అది ఓ భావానికి సంకేతం! 'లవ్ ఈజ్ గాడ్' అన్నప్పుడు ఆ వాక్యంలోని 'లవ్' ఎదుట చేతులు జోడించాలనిపిస్తుంది. కుక్క 'లవ్ లవ్' మని మొరిగినప్పుడు దుడ్డు కర్ర చేతికి తీసుకోవాలనిపిస్తుంది. కాగా పోగా చక్రపాణి ప్రేమ ఇప్పుడు జయప్రద పైకి ప్రసరించి, అక్కడ వక్రీభవనం చెంది సూటిగా శోభాదేవిని తాకుతోంది. ఈ పరిణామాన్ని ఇంతకంటే సునిశితంగా వివరించడానికి నేను చాలను ప్రకాశం! అందుకు ఫ్రాయిడ్ స్వయంగా దిగిరావాలి. లేటెస్ట్ డెవలప్‌మెంట్ ఏమిటో చెబుతాను ప్రకాశం – జయప్రద ఇప్పుడు మీ అత్తయ్యకు, చక్రపాణి తల్లితండ్రులకూ మధ్య పెళ్ళి పెత్తనాలు సాగిస్తోంది...."

వింటున్నకొద్దీ ప్రకాశానికి తలబరువెక్కి పోతోంది. కణతల్ని వ్రేళ్ళతో బిగబట్టుకుని మోచేయి వూతగా అతడు అరుగు పైకి వ్రాలిపోయాడు.

"తపాలా శాఖను తీవ్రంగా ఎదుర్కొనే చిక్కొకటి ఉంది ప్రకాశం!" మాట్లాడుతున్న కొద్దీ శేఖరంలో ఉత్సాహం అతిశయిస్తోంది. "అదే, చిరునామా తెలియని జాబుల గొడవ! ఈ జగన్నాటక రంగంపైన కూడా మనకప్పుడప్పుడూ చిరునామా తెలియని జాబుల్లాంటి వ్యక్తులు కొందరు తారసిల్లుతుంటారు. వాళ్లెక్కడి నుంచి వచ్చారో తెలియదు. వాళ్ళ గమ్యమేదో తెలియదు...."

"ఎవర్ని గురించి చెబుతున్నావు శేఖరం?" అడ్డు తగిలి ప్రశ్నించాడు ప్రకాశం!

"జాబితాలో రెండో వ్యక్తిని గురించి! తనని గురించి ప్రపంచానికేమీ తెలియకపోవడం ఉంది చూచావా ప్రకాశం. అదొక్కటే ఆకర్షణ కాదు! దీనితోబాటు అతని పేరూ, వాలకమూ, మాటల ధోరణీ, పర్సులోనుంచీ ఎడమ చేతితో వంద రూపాయలనోట్లను పైకి తీసే తీరు – ఇవన్నీ శచీంద్రబాబుకున్న ఇతర ఆకర్షణలు. ఇన్నింటికీ మించి, అతనిలో విరహ లక్షణాలు కొన్ని ఉన్నాయి. అతడు తన జీవితానికి సంబంధించిన వంటూ కొన్ని విషాదాంత ప్రణయ గాథలు కూడా పేర్కొంటాడు. ఆ విరహ లక్షణాలతో, ఈ ప్రణయ గాథలతో అతడు సలీం, ఖయస్, దేవదాసుల తర్వాత మళ్లీ అంతటి విషాద ప్రేమికుడుగా కనిపిస్తాడు. మీ అత్తయ్య, శోభ, జయప్రద లాంటి వాళ్ళందరూ అతడి సాన్నిధ్యంలో మంత్రముగ్ధులు. అంతెందుకు ప్రకాశం – పారిస్ సమాజంలో కౌంట్ ఆఫ్ మాంట్ క్రిస్టోకైనా ఇలాంటి పరిగణన లభ్యమై ఉండదు".

"ఇక చాలు గానీ ఇంతటితో నీ అక్షయ భాండాన్ని మూసిపెట్టు శేఖరం! నా ఓపికనుబట్టి మళ్ళీ ఎప్పుడైనా మరికొంత అమృతం పుచ్చుకుంటాను" అన్నాడు ప్రకాశం.

"అదేమిటి ప్రకాశం! ఇంకా సినిమాలు తీసే సుగుణాకరమున్నాడు. నాగపూర్‌లో ఎక్కడో ఉద్యోగం చేస్తున్న విశ్వనాథం గారి అబ్బాయి ఉన్నాడు...."

మిత్రుడి వాక్ప్రవాహం బారి నుంచీ తప్పించుకోవడానికి ప్రకాశానికో ఉపాయం స్ఫురించింది. "ఉండే ఉంటారు కానీ మనలో మనమాట శేఖరం! జాబితాలో నువ్వెన్నోవాడివి?"

"అబ్బో నేనేమిటో అనుకున్నాను ప్రకాశం! నువ్వు నేననుకున్నంతటి అమాయకుడివి కావు. మనదేముంది! లేదంటే మీ మామగారు, మా నాన్నగారు ఒకే క్లబ్బులో మెంబర్లు. అందువల్ల ఎప్పటికప్పుడు ఇక్కడి వర్తమానాలు నా చెవిదాకా వస్తుంటాయి...."

ఒకటి రెండుసార్లు ఆవులించి, అరుగుపైన్నే కాసేపు కునికిపాట్లు పడి ప్రకాశం దగ్గర సెలవు తీసుకుని స్వగృహాభిముఖుడై వెళ్ళిపోయాడు శేఖరం.

ఎప్పుడలముకున్నాయో ప్రకాశానికి తెలియదు. ఆకాశాన మబ్బులు గుడారం వేసుకున్నాయి. ఉండి ఉండీ చినుకులు రాలసాగాయి. వడగళ్ళ లాంటి చినుకులు నాలుగు ఒంటిపైన పడడంతో ప్రకాశం దిగ్గున మేలుకున్నాడు. పదకొండూ ఇరవై చూపుతోంది చేతి గడియారం.

హాల్లో అయిదు నిమిషాలు మాత్రం కూర్చోగలిగాడు ప్రకాశం. జయప్రదా దేవి పాటకచ్చేరీ పూర్తయి ఇప్పుడక్కడ చదరంగాలు, చుతర్ముఖ పారాయణాలు, లోకాభిరామాయణాలు జోరుగా జరుగుతున్నాయి. అగరువత్తుల మధుర పరిమళాలకు బదులుగా ధూమ మేఘమాలికలు నర్తిస్తున్నాయి. పూలదండలు వాడిపోయి వెలవెల పోతున్నాయి.

ప్రకాశం మేడపైకి వెళ్ళాడు.

శోభాదేవి గదిలో దీపం వెలుగుతోంది.

పాదరక్షల సవ్వడి వినిపించిందేమో, గడియ తీసి తలుపులు తెరుస్తూ "నువ్వా బావా" అంది శోభ.

"నేనే శోభా" అన్నాడు ప్రకాశం.

"కూర్చుందువు గానీ లోపలికి రా బావా!" పిలిచింది శోభ.

"కూర్చోడమెందుకులే శోభా! పడుకోవాలి. నేను నీ గది ఎదుటకు వచ్చేసరికి నాకో విషయం జ్ఞప్తికి వచ్చింది. వెనుకటికెవరో పెళ్లి ఏర్పాట్లన్నీ ఘనంగా చేసి మంగళసూత్రం చేయించడం మరచిపోయారట! నా విషయంలోనూ ఇంచుమించు అంతే జరిగింది. నీ కోసం ఓ కానుక తెచ్చాను. తెచ్చిన కానుకను చేతిసంచిలో ఉంచి నీ గదిలో గోడకు తగిలించాను..."

"ఇప్పుడైనా మించిపోయిందేముంది బావా! ఏదీ నీ కానుక?" బల్లవైపు చూస్తూ అడిగింది శోభ. జన్మదినోత్సవ సందర్భంలో వచ్చిన కానుకలన్నీ ఆ బల్లపైనే ఉన్నాయి. చీరలు, నగలు, వెండిపాత్రలు, పుస్తకాలు....

సంచిలో నుంచీ పొట్లాన్ని తీసి శోభాదేవి చేతుల్లో పెట్టాడు ప్రకాశం.

నూలుపోగులు తెంచి కాగితాల ప్యాకింగును విడదీసింది శోభ. అది ఓ చిన్న చలువరాతి బుద్ధ విగ్రహం.

"బుద్ధ దేవుడా బావా!" ప్రకాశం కళ్ళల్లోకి చూచింది శోభ.

"అవును శోభా! ఇంతకంటే సముచితమైన కానుకేదీ నాకు స్ఫురించలేదు. అశాంతికీ, గందరగోళానికీ తావలమైపోతున్న ఈ ప్రపంచంలో బుద్ధ భగవానుడి దర్శనం కన్నా మనసుకు శాంతి కలిగించేదేముంది శోభా! కానుకతోబాటు నా శుభాకాంక్షలు కూడా స్వీకరించు. వెళ్ళొస్తాను శోభా! సెలవు..." మెల్లగా బయటికి వచ్చేశాడు ప్రకాశం.

## 4

రెండేళ్ళు గడిచిపోయాయి. గడిచిపోయిన తర్వాత వెనుదిరిగి చూచుకుంటే వాటి అడుగుజాడలైనా లేవు. రేయింబవళ్ళన్న రెక్కలు గట్టుకుని కాలం ఒక పక్షిలా పరతెంచిపోతుంది కాబోలు! ప్రకాశం అప్పుడప్పుడూ ఆలోచిస్తూ కూర్చునేవాడు. ఏలాగో రెండుళ్ళు గడిచిపోయాయి. ఇకపైన ఎంతోకాలం గడవదు. "ఇప్పటికే ఆలస్యమైంది. రానున్న వైశాఖంలో ఆ శుభకార్యం కాస్త జరిగిపోవాలి" అంటూ అమ్మ అదేపనిగా సతపోరుతోంది.

'కుట్టితే తేలు. కుట్టకపోతే కుమ్మర పురుగు' అన్న సూత్రం ఆధారంగా ఎదుటి మనిషిని అంచనా వేసే లోకుల పాలిటికి ప్రకాశం తరహా అదోరకంగా కనిపించిన మాట నిజమే! కానీ లోకులనుకున్నట్లుగా ప్రకాశం విరాగీ కాడు. వివాహానికి విముఖుడూ కాడు. లేదంటే సెంటుపూతల ఘుమాయింపులతో, మాటమాటకు రాసికృతను వెలిగ్రక్కుతూ, త్రోవపొడుగునా ఓరచూపులు బరపుకుంటూ వీధుల వెంట షికార్లు తిరగలేదు ప్రకాశం. అదే అతడి దోషం. ఈ దోషాన్ని - కాదా రాసికృతా లోపాన్ని వ్రేలెత్తి చూపి ప్రకాశాన్ని అపహసించిన మిత్రులు సైతం లేకపోలేదు. అప్పుడు కూడా ప్రకాశానికి ఆలోచనే శరణ్యమయ్యేది. ఏమిటీ ప్రపంచం? ఎక్కడికి దీని ప్రయాణం? కామినీ కాంచనాల ఆకర్షణను అధిగమించడం దుస్తరమే! కానీ అలాగని మనసు కళ్ళాన్ని వదలిపెట్టి ఇంద్రియాశ్వాలను వాటి రాతకొద్దికీ వాటికీ పరుగెత్తనిస్తే చివరికి మానవుడి జీవితం ఏమౌతోందో? ఎక్కడో ఒకచోట ఎవరో ఒకాయన చెబుతుండగా విన్నాడు ప్రకాశం - ఈ ప్రపంచంలో మరికొంత కాలానికి స్త్రీ పురుష సంబంధం ఒక్కటి తప్పితే తదితర సమస్యలేవీ ఉండవట! విశ్వరూపం ధరించి మానవ జీవితాన్ని విహ్వలం చేసి పారవేసే ఆఖరు సమస్య అదేనట! ఏ మహర్షీ చెప్పనిమాట! మతాచార్యుడు వ్రాక్రువ్వని మాట! గుండెను గుప్పిట్లోకి తీసుకుని భయపడి పోయాడు ప్రకాశం. అయితే ఇన్ని సాంఘిక నియమాలు, ఇన్ని నీతి శాస్త్రాలు, ఇన్ని ప్రభుత్వ శాసనాలు మానవుణ్ణి రక్షించబోవడం లేదన్నమాట! మరొకాయన అప్పటికి తనేదో ఉపనిషత్తుకు వ్యాఖ్యానం భాషిస్తున్నంత గంభీరమైన భోజు పెట్టి చెప్పాడు ప్రకాశానికి. ప్రేమ ఏకవ్యక్తి నిష్ఠమైనప్పుడు పవిత్రమైనదని ప్రస్తుతిస్తూ అదే ప్రేమ బహువ్యక్తి పరివ్యాప్తమైనప్పుడు వ్యభిచారమని ఈసడించడం బొత్తిగా అవివేకమట! వక్రభాష్యాలు మారకపు వస్తువుల్లా బుద్ధిని తాడనం చేస్తాయి. వాటి ప్రభావానికి లోనైన మనసు మొద్దుబారిపోతుంది. బహువ్యక్తి పరివ్యాప్తమైన ప్రేమ! అబ్బో, లోక ప్రతారణానికి ఎంత చిట్కా ఇది? విషయ లోలుపత్వానికొక మంచి పేరు కనిపెట్టిన ఆ పెద్దమనిషి విజ్ఞతను మాత్రం అభినందించకుండా ఉండలేకపోయాడు ప్రకాశం.

ప్రకాశం వివాహానికి సుముఖుడుగా లేడన్న వార్తకైతే తమ శాయశక్తులా ప్రచారం సాధించిపెట్టారు గానీ, ఆతడి మనసు లోపలి మనసులో నిగూఢంగా దాగివున్న ఆంతర్యాన్ని పసిగట్టిన బంధుమిత్రులెవ్వరూ లేరు. శోభ తనకు మేనత్త కూతురు. మేనత్త ప్రసవం

కోసం పుట్టింటికి వచ్చింది. అప్పటికి తనకింకా అయిదేళ్ళు నిండలేదు. ఓ రోజు శుభోదయాన పనసపండులాంటి చిన్నారి బుజ్జిపాపను ప్రక్కలో పరుండబెట్టుకున్న అత్తయ్య తనను చేరువకు తీసుకుని "ఒరే ప్రకాశం నీకు పెళ్ళాం పుట్టిందిరా" అంది. తనతోబాటు ఆ మధుర భావన కూడా పెరిగి పెద్దదౌతూ వచ్చింది. ఇరువదేండ్లుగా తన హృదయోద్యానంలో దినదిన ప్రవర్ధమానంగా శోభిల్లుతూ వచ్చిన ఆ రాగవల్లరిని ఈనాడు సమూలంగా పెల్లగించివేయాలని చూస్తున్నాయి పరిస్థితులు.

మరోవైపున శోభాదేవి కోసం వరాన్వేషణ కూడా తీవ్రంగానే కొనసాగుతోంది. అత్తయ్యకిప్పుడీ ధ్యాస తప్పితే ఇతర వ్యాసంగాలు లేవు. ప్రతి సంబంధానికీ బొమ్మతో బాటు బొరుసుకూడా కనిపించడంతో ఆవిడ హతాశురాలై పోయింది. చక్రపాణి మంచివాడే! కానీ అతడు తల్లితండ్రులకు కడగొట్టు బిడ్డ. అతనికంటే పెద్దవాళ్లయిదారు గురున్నారు. ఆ అత్తమామలు, ఆ బావలూ, తోడుకోడళ్ళూ, వాళ్ళ బిడ్డలూ అందరితో కలిసి అది ఓ లంకంత సంసారం! ఆ సమిష్టి కుటుంబంలో శోభ ఎలా ఊపిరి త్రిప్పుకోగలుగుతుంది? చక్రపాణి తరువాతి వాడు శచీంద్రబాబు. ఇతణ్ణి పెళ్ళాడిన అమ్మాయికి అత్తమామల ఆరడి గానీ, తోడుకోడళ్ళతో పొరపొచ్చాలు గానీ ఏర్పడడానికి ఆస్కారమే లేదు. ఎందుకంటే శచీంద్రబాబు ఏకాకి! అదే, ఆ ఒంటరితనాన్ని చూస్తేనే అత్తయ్యకు భయం! ఏ అమ్మగన్న బిడ్డో గానీ ఈ శచీంద్రబాబుకు పునాదులే లేవు. ఇతని డబ్బు న్యాయార్జితం కాదనీ, ఇతని చరిత్ర అనుకున్నంత ఉదాత్తం కాదనీ పుకార్లు కూడా ఉన్నాయి. తెలిసీ తెలిసీ తన కుమార్తెను నూత తోసేటంతటి మూర్ఖురాలా అత్తయ్య! జాబితాలో మూడోవాడు సుగుణాకరం. అతనికి కూడా తల్లితండ్రులు లేరు. సువిశాలమైన మాగాణి పొలాలకు అతడు ఏకైక వారసుడు. కానీ సుగుణాకరంతో వచ్చిన చిక్కల్లా ఒక్కటే! అతడిదివరకే ఓ అమ్మాయిని పెళ్ళాడి ఆమెకు విడాకులిచ్చేశాడు. ఆ తరువాత సినిమాలోకంలో ఓ నాట్యతారను పెళ్లాడి ముచ్చటగా మూడు నెలలు కాపురం చేసి ఈసారి ఆవిడ దగ్గర నుంచి విడాకులు పుచ్చుకున్నాడు. పొరబాటు గ్రహపాటుగా మారింది కనుక, ఇక ఆ గ్రహ పాటు అలవాటుగా పరిణమించదనటానికి ఆస్కారం ఎక్కడ? ఇలా ఒక్కొక్కరినీ త్రోసి రాజనుకుంటూ వచ్చి ఒక ఘట్టంలో అవకాశాలన్నీ శేఖరం పట్ల మొగ్గు చూపాయి. శేఖరం తండ్రికొక్కడే కొడుకు. కానీ ఆ తండ్రి ఏమంత కలిగినవాడు కాదు. పోగా శేఖరానికి పెళ్ళి కావలసిన చెల్లెళ్ళు నలుగురున్నారు. ఒకవేళ శేఖరం ఇల్లరికానికి ఒప్పుకున్నా అత్తగారిల్లన్న ధనధ్రువం నుంచీ అమ్మగారిల్లన్న ఋణ ధ్రువంలోకి విద్యుత్తు ప్రవహించదనుకోడానికి అవకాశం లేదు. ఈ విధంగా ఆ సంబంధం కూడా అత్తయ్య నిరాదరణకే పాత్రమైంది.

చివరికొక సంబంధం మాత్రమే మిగిలింది. మధ్యవర్తుల ఎడతెగని ప్రయత్నాల వల్ల అదే కుదిరింది. లోకులందరూ విశ్వనాథం గారి అబ్బాయి రమాపతి అదృష్టవంతు డనుకున్నారు. ఇంత మంచి సంబంధం కుదిరింది కనుక శోభ కూడా అదృష్టవంతురా లనే బంధులోకం భావించింది. విశ్వనాథం గారికి కూడా మగవాళ్ళు, ఆడపిల్లలు కలిసి సంతానం ఏడెనిమిది మందికి తక్కువ గాదు కానీ, వాళ్ళందరూ ఎవరికి వారు వేర్వేరు ఊళ్ళల్లో ఉన్నారు. పైగా విశ్వనాథం గారు తమ కొడుకుల సంపాదనలో నుంచీ ఒక్క నయాపైసా అయినా ఆశించేవారు కారు. రమాపతి నాగపూర్‌లో ఉన్నతోద్యోగి. ఉచిత నివాస, ఉచిత వాహన సౌకర్యాలున్నాయతనికి! గొప్ప ఉద్యోగస్తుడి భార్యగా తన కూతురు నలుగురి మన్నన లందుకోవచ్చు. దేశం చూడవచ్చు. జీవితాన్ని ఓ పాటగా పాడుకోవచ్చు. అత్తయ్యకు అమందానందం కలగడంలో అబ్బురమేముంది?

పెళ్లికి చంద్రాన్ని తోడిచ్చి, తల్లిని పంపించాలనుకున్నాడు ప్రకాశం. కానీ పార్వతమ్మ తాను వెళ్లనంటే వెళ్లనని మొండికేసింది. చివరకు చంద్రం ఒక్కడే వెళ్ళి నాలుగు రోజులుండి తిరిగి వచ్చాడు. వచ్చినవాడు ముఖం ముడుచుకుని మౌనవ్రతం పట్టినట్టుగా రెండు రోజులపాటు బిర్రబిగుసుకుని కూర్చున్నాడు.

వేయి విధాలుగా బుజ్జగింపబడిన తరువాత ఇటు తల్లిపైకి అటు ప్రకాశంపైకి రూక్షవీక్షణాలు బరపుతూ "చెప్పడానికేముంది! అందరూ కలసి శోభ కన్యాయం చేశారు" అన్నాడు చంద్రం.

"అదేమిట్రా చంద్రం! ఏం జరిగిందో చెప్పరా బాబూ, చంపక" ప్రాధేయపడింది పార్వతమ్మ.

కాకపోతే అతడేం పెళ్ళికొడుకమ్మా! మన మనిషి కాదు. మన మాటలు కావు. పంచకట్టుకోమంటే కట్టుకోడు. పాంటుతోనే పెళ్ళిపీటలపైన కూర్చుంటాడు. అతడు పురోహితుడితో మాట్లాడ్డం కూడా ఇంగ్లీషులోనే! పెళ్ళికూతురి వ్రేలు పట్టుకోమంటే మాటి మాటికీ మరచిపోతాడు. ఎవరైనా జ్ఞాపకం చేస్తే 'ఓహో' మరచిపోయాను గదూ, అంటూ పెళ్ళిపందిరి పైకెగిరిపోయేటంత బిగ్గరగా నవ్వేస్తాడు. నాకళ్ళతో నేను చూచానన్నయ్యా! కంచుపాత్రలో గులకరాళ్ళుపోసి గిలకరించినట్టుగా ఒక్క పెట్టున అతడి నవ్వు ప్రారంభమయ్యే సరికి శోభ వులికిపడి గాబరా పడిపోతుంది. ఒకసారేం జరిగిందో తెలుసా అన్నయ్యా! పెళ్ళికొడుకు పెళ్ళికూతురూ మండపం చుట్టూ తిరుగుతున్నారు. ద్వారం దగ్గర ఎవరు కనిపించారో ఏమిటో పెళ్ళికొడుకు 'హలో' అంటూ చేతులు బారగిల చాపుకుని అడ్డంగా కూర్చున్న వాళ్ళని తొక్కేస్తూ పరుగెత్తసాగాడు. మధ్యలో నలుగురడ్డుపడి కొంగుముడి విప్పి వేశారు కనుక సరిపోయింది. గానీ లేకుంటే అతడు శోభనలాగే ద్వారం దాకా లాక్కెళ్ళి పోయి ఉండేవాడు...."

విచారంలో కూడా నవ్వక తప్పింది కాదు ప్రకాశానికి, "ఆది కాలంలో ఎప్పుడో మహావిష్ణువు గజేంద్రుని రక్షింపబోతూ ఉండగా ఇలాంటి సంఘటనే జరిగిందట్రా చంద్రం!" అన్నాడు ప్రకాశం.

"ఇప్పుడిలా నవ్వులాటగానే ఉంటుంది. కానీ ఎప్పుడో ఒకప్పుడు అందరూ కలిసికట్టుగా విచారించక పోరు" అన్నాడు చంద్రం.

"నువ్వొక పిచ్చిపుల్లయ్యవిరా చంద్రం! వాళ్ళు కోరికోరీ వరుణ్ణి తెచ్చుకుంటే వంకలెన్నడానికా నువ్వు పెళ్ళికి వెళ్ళింది. చాల్లే వూరుకో" మందలిస్తూ పార్వతమ్మ లోపలికి వెళ్ళిపోయింది.

ప్రకాశానికి ఇదేమిటో విపరీతమనే అనిపించింది. పెళ్లికొడుకు బాగా చదువుకున్నవాడు. పెద్ద ఉద్యోగం చేస్తున్నాడు. మరైతే పదిమందిలో ఎందుకిలా ఎబ్బెట్టుగా ప్రవర్తించాడు? మానవుడు సంఘజీవి. సంఘంలో తానూ ఒక్కడుగా మెలగుతూ తనకొక ప్రత్యేకతను, లేదా విశిష్టతను సంతరించుకోడానికి మానవునికి చాలా మార్గాలున్నాయి. ఎబ్బెట్టుగా ప్రవర్తించడం ఆ మార్గాల్లో ఒకటిగాకపోయినా, ప్రత్యేకతను నిలుపుకోడానికొక అడ్డుదారైతే కావచ్చు.

ఓ నిర్ణయానికి వచ్చాడు ప్రకాశం. ఈనాడు శోభ తనకేమీ కాదు. కేవలం అన్యకాంత. పోగా ఆమె ముక్కుపచ్చలారని పసిబిడ్డగాదు. భర్త అభిరుచులకు అనువుగా ఆమె తన జీవితాన్ని మలచుకోవచ్చు. లేక భర్తనే తన అభిరుచులకు అనువుగా సంస్కరించుకుని తన చీర చెరగువెంట త్రిప్పుకోవచ్చు. ఈ రెండేగాక మరొక పద్ధతి

సైతం లేకపోలేదు. "రథమునేనైతేను, రంగి చక్రాలు; మా మానసులే మంచి గుర్రాల జోడు...." అన్న కవిగారి సూక్తి ప్రకారం ఆమె సంసారాన్ని మరింత శోభావహంగా కూడా చక్కదిద్దుకోవచ్చు. ఏది ఏమైనా తానిక శోభను గురించి ఆలోచనలు పెట్టుకోవలసిన అవసరమేమీ లేదు.

## 5

నిర్ణయాలు చేసుకోవడం తేలికే! కానీ మనోఫలకం మీద నుంచీ జ్ఞాపకాలకు పూర్తిగా చెరిపి వేయడంగానీ, ఆలోచనలు రాకుండా అరికట్టడం గానీ, మాటలాడినంత సులభం కాదు. కానీ వీలయినంత వరకూ ప్రకాశం శోభాదేవిని గురించి మరచిపోవడానికే ప్రయత్నించాడు.

కాలం పరుగిడుతోంది.

ఆరు మాసాలు గడచిపోయాయి.

ఒక పర్యాయం ఏదో స్వంతపనిమీద పట్టణానికి వెళ్ళవలసి వచ్చింది ప్రకాశం. మామగారింటికి వెళ్ళగూడదన్న పట్టింపేమీ లేదుగానీ, ఇటీవలి పరిణామాల దృష్ట్యా తానక్కడికి వెళ్ళడం ఇటు తనకూ అటు అవతలివాళ్ళకూ కూడా ఇబ్బందిగానే ఉంటుందని అతడా ప్రయత్నం విరమించుకున్నాడు. వెళ్ళిన పని అనుకున్నంతకంటే త్వరగానే ముగిసిపోయి, బస్సు బయల్దేరడానికింకా ఒకటీ రెండు గంటల వ్యవధి ఉండిపోయి, ఆ వ్యవధిలో ఏం చేయాలో తోచక మెల్లగా బజారు వెంట నడుస్తున్నాడు ప్రకాశం. అతడారోజు నిశ్చింతగా ఇంటికి తిరిగిరావడం భగవంతుడి కిష్టంలేక పోయిందేమో మరి! బజారులో ప్రకాశానికి తుఫానులా ఎదురయ్యాడు శేఖరం.

"ఎంతకాలానికి కనిపించావు ప్రకాశం! నువు సేవిస్తున్న సిద్ధౌషధమేదో చెప్పరాదట్రా బాబూ! రోజు కొకరకంగా ప్రపంచ చరిత్రకూడా మారిపోతోంది. నువ్వు మాత్రం చెక్కు చెదరడం లేదు. రెండేళ్ళకు మునుపు శోభాదేవి పుట్టినరోజు విందులో ఎలాగైతే కనిపించావో, ఇప్పుడూ అలాగే ఉన్నావు. నన్ను చూడు, నా అంతట నేనుగా నిన్ను పలకరించబట్టి సరిపోయింది గానీ లేకుంటే నువ్వు నన్ను గుర్తుపట్టి ఉండవు"....

ఆమాట నిజమే! ఒకటీ రెండు వారాలపాటు రోగశయ్యను ఆశ్రయించుకుని ఉండి అప్పుడే ఆసుపత్రి నుంచి డిస్చార్జి అయిన రోగిలా ఉన్నాడు శేఖరం!

"అయినా మరేం పరవాలేదు లేవోయ్ ప్రకాశం! అరగంటకో కప్పు చొప్పున వేడి వేడిగా ఇన్ని కాఫీనీళ్ళు ఈ తోలుతిత్తిలో పోస్తున్నంత కాలం, గాలితో నిండిన బెలూనులా మనపని ఉత్సాహంగానే ఉంటుంది. ఇప్పుడే హోటల్లోనుంచీ బయట పడ్డాను గనుక, కాసేపు నేను నీకు కాలక్షేప సాధనంగా ఉపకరించగలను. ఆ పార్కులోకి వెళ్ళి కూర్చుందాం పద!"

పార్కులోకి వెళ్ళి కూర్చోగానే అసలు విషయం లోకి వచ్చేశాడు శేఖరం. "ఈ మధ్య నేను నీకొక జాబు కూడా వ్రాయాలనుకున్నాను ప్రకాశం! కానీ నీకు తెలిసిందే కదూ! మనిషి కనిపిస్తే మాటల్ని జడివానలా వర్షించగలను గానీ కలం చేతికి తీసుకొని నాలుగు వాక్యాలు వ్రాయాలంటే నాకు బద్ధకం! అదిగో, అప్పుడే ఆశ్చర్యపడిపోతున్నావు నువ్వు! ఆశ్చర్యపడవలసిన విషయమే మరి! మూడు నిద్రలు చేసిన తరువాత ఎంతటి ముద్దరాలైనా సరే భర్తను వదలిపెట్టి ఉండాలనుకోదు. ఒకవేళ తప్పనిసరిగా పుట్టినింటికి వెళ్ళవలసి వచ్చినా, ఆవిడ మళ్ళీ భర్తృసమాగమాన్ని గాఢంగా వాంఛించడం సహజం. ఈ లోకసామాన్యమైన విషయానికి నాకు తెలిసినంతలో శోభాదేవి ఒక మినహాయింపు.

మళ్ళీ ఇదేమో ప్రియపడి చేసుకున్న పెళ్ళి. ఆలు మగలిద్దరూ బాగా చదువుకున్న వాళ్ళు. భోగ భాగ్యాలకా తక్కువలేదు...."

"నీకు పుణ్యముంటుంది గానీ కాస్త వివరంగా చెప్పు శేఖరం! ఇప్పుడు శోభ పుట్టింటి దగ్గరే ఉందా ఏమిటి?"

"ఉండకపోతే ఈ ప్రసక్తి ఎందుకొస్తుంది ప్రకాశం! కారణమేమిటో అనూహ్యం. వెళ్ళిన తరువాత నెల రోజులకే తిరిగి వచ్చింది శోభ. మళ్ళీ వెళ్ళలేదు. అసలు వెళ్ళాలన్న ధ్యాసే ఆమెలో కనిపించదు. భార్యాభర్తల మధ్య ఉత్తర ప్రత్యుత్తరాలు కూడా సాగుతున్నట్టు లేదు...."

మనసునిండుకూ విషాదాన్ని నింపుకుని స్వగ్రామానికి తిరిగి వచ్చాడు ప్రకాశం. వచ్చిన పది రోజులకే అతడికో వార్త తెలిసింది. ఎందరెందరో పనిగట్టుకుని హితబోధ చేయగా భర్త దగ్గరికి వెళ్ళడానికి సమ్మతించిందట శోభ. ఈసారి తల్లిదండ్రులే ఆమెను తీసుకెళ్ళి భర్త సాన్నిధ్యంలో దిగవిడిచి వచ్చారట!

పెళ్ళయిన తర్వాత భర్తతో ఒద్దికగా కాపురం చేసుకోకుండా తమ పంచన పడివున్న కూతురు కన్నతల్లిదండ్రులకు సైతం బరువుగానే పరిణమిస్తుందేమో! వాళ్ళమాట కేమిగానీ తన తలపైన్నుంచీ కొండంత బరువు క్రిందికి దిగిపోయినంతగా సంతోషించాడు ప్రకాశం.

✧ ✧ ✧

చెడిపోయిన నీళ్ళుతోడే యంత్రాన్ని రిపేరీ చేయించడం కోసం బస్ టాప్ మీద వేయించుకుని పట్టణానికి వెళ్ళాడు ప్రకాశం. యంత్రానికి సంబంధించిన మరమ్మత్తులు ఒక పట్టాన పూర్తిగాక పోవడం వల్ల నాలుగైదు రోజుల వరకూ అక్కడే ఉండి పోవలసి వచ్చింది. ప్రకాశం ఆలోచించాడు. అత్తమామలను చూచి చాలాకాలమైంది. జరిగిందేదో జరిగిపోయింది. కనుక లేనిపోని వైమనస్యాలను మదిలో ప్రోదిచేసుకుని బాధ పడటం వల్ల లాభమేముంది? కాదంటే అన్నంతో బాటుగా, నాలుగు సూటిపోటు మాటలు కూడా వడ్డిస్తుందేమో అత్తయ్య! పద్ద వాళ్ళెప్పుడూ చెడ్డవాళ్ళు కారు గనుక ఆవిడ అనావచ్చు. తాను వినావచ్చు....

ప్రకాశం అంచనాకు విరుద్ధంగా కంటనీళ్ళు పెట్టుకుంది అత్తయ్య. "ఇంతకాలానికి జ్ఞప్తి కొచ్చామా నాయనా! మీరు త్రెంచుకోదలచుకుంటే మాత్రం రక్తసంబంధాలు తెగిపోతాయట్రా ప్రకాశం? రెండు మాసాలు నుంచీ నువ్వు నాకళ్ళల్లో మెదలు తున్నావనుకో? ఒక్కసారి ఇక్కడికి వచ్చిపొమ్మని చెప్పి, నీకోజాబు వ్రాయమని మీ మామయ్యతో చెప్పాను కూడా! కానీ ఆయనకు తీరికేది! ఆ వ్యాపారాలేమిటో, ఆయనేమిటో అంతేగానీ ఆయనకు మరొక గొడవ కాబట్టదు. ఇంతచేశావా భగవంతుడా అని లోలోపలే కుమిలి పోవడానికి ఈ ఇంట్లో నేనొక్కదాన్ని మాత్రమే మిగిలాను...."

అత్తయ్యకు వచ్చిన కష్టమేమిటో ప్రకాశానికి స్పష్టంగా అవగతమైంది గాదు. ఆవిడ వాక్ప్రవాహం అలాగే మరికొంత దూరం ప్రవహిస్తే ఆ వివరం తనంతటదే తెలిసి వస్తుంది లెమ్మనుకుని అతడు మౌనంగా ఉండిపోయాడు.

"బ్రతకాలని బావి త్రవ్వగా నీళ్ళకు బదులు బండరాయి పైకి తేలితే మరేమను కోవాలిరా ప్రకాశం! అతగాడు పెద్ద ఉద్యోగమే చేస్తున్నాడనుకో? అయితే మాత్రం? ఇంటికీ ఆఫీసుకూ తేడా తెలియకపోతే అతణ్ణి గురించి ఏమనుకోవాలి? ఉదయం అయిదుగంటల కల్లా అలారం పెట్టిన గడియారంలా నిద్ర లేచేస్తాడు. ఇక చూసుకోరా బాబూ, మిషను కూడా అలా పనిచేయదు! కాలం ఖరీదు చాలా ఎక్కువట! ఒక్క క్షణం కూడా వృథా చెయ్యకూడదట! ఉదయం ఆరోగంటకల్లా ఫ్లాస్కులో కాఫీ సిద్ధంగా ఉండాలి.

లేకుంటే ఆ పూటకిక కాఫీ అనవసరమంటాడు. సాయంత్రం సినిమాకు సిద్ధం కమ్మంటాడు. ముస్తాబు చేసుకోడంలో అయిదు నిముషాలు ఆలస్యమైతే ఆరోజుకిక సినిమా ప్రోగ్రాము రద్దేనంటాడు. అలాంటి స్ట్రిక్టు ఆఫీసరుకింద పెళ్ళామైతే మాత్రం ఎలా తట్టుకోగలుగుతుంది రా ప్రకాశం?"

"ఇదేం చాదస్తమత్తయ్యా! తట్టుకోక చేసేదేముంది? బ్రతుకంటే అదేమిటో అల్లా టప్పా వ్యవహారమనుకుంటారు మీరు. పరిస్థితులకూ, పరిసరాలకూ సర్దుకోడమే జీవితం", కాస్త కటువుగానే హితవు చెప్పాడు ప్రకాశం.

అత్తయ్య విస్తుపోయింది. "అయితే ఆ మాత్రం నిరవాకానికి అమ్మాయిని అతనివెంట ఎందుకు పంపాలిరా ప్రకాశం! ఇక్కడేదైనా ఉద్యోగంలో చేర్పించితే సరిపోదూ?"

ఇదేం ప్రశ్న! దీనికేమని సమాధానం చెప్పాలి! తల దిమ్మదిరిగి పోయింది ప్రకాశానికి.

కాఫీ తీసుకురావడానికి అత్తయ్య లోపలికి వెళ్ళింది. బయట సూర్యాస్తమయా నంతరం చీకటి నీడలు చిక్కగా అలముకుంటున్నాయి. మీటనొక్కి విద్యుద్దీపాలు వెలిగించే పాటి ఓపిక కూడా ఇక్కడెవ్వరికీ లేదేమో. మేడలోపల సైతం అంధకారమే నడయాడుతోంది. అందుకు తోడూ ధ్యాన సమాధిలో కూర్చున్న యోగిసత్తముడిలా గాలి దేవుడు కూడా కదిలీ మెదలకుండా స్తబ్దుడై ఉన్నాడు. దగ్గర్లో ఎవరిదో పద ధ్వని వినిపించినట్టుగా తోచి తల పైకెత్తాడు ప్రకాశం.

తల పైకెత్తి ద్వారంవైపు చూచిన క్షణంలో ఆశ్చర్యాతిరేకం వల్ల కొయ్యబారి పోయాడు ప్రకాశం.

తెల్లటి చీర, చెల్లాచెదరైన ముంగురులు, బోసిగా ఉన్న నుదురు, వడగాలి దెబ్బకు వాడిపోయిన తోటకూర కాడలా నల్లటి తెరపైన తెల్లటి నీడలా మెల్లగా నడచి వస్తోంది శోభాదేవి.

ప్రకాశానివి అనిమిష నయనాలు.

"ఎప్పుడొచ్చావు బావా?" శోభాదేవి పలకరింపు.

జవాబు లేదు.

"అదేమిటి బావా అలా తెల్లబోయి చూస్తున్నావు?"

ప్రకాశంలో చలనం లేదు.

వ్రేళ్ళు ముడుచుకుని పిడికిలి బిగించింది శోభాదేవి. "మాట్లాడుతావా, తలపైన ఓ మొటిక ప్రసాదించమంటావా బావా?"

"ఏమని మాట్లాడను శోభా! నువ్విక్కడే ఉన్నావని అనుకోలేదు నేను..."

"ఈమాత్రంగానైనా నేను సుఖపడిపోతున్నందుకు నీకు ఈర్ష్యగా ఉందా బావా? నువ్వు మాత్రం మగవాడివి కావా ఏమిటి?" ఒక్క విసురులో మేడ మెట్లపైకి వెళ్ళిపోయింది శోభ.

అత్తయ్య కాఫీగ్లాసుతో ప్రత్యక్షమైంది. "చూచావా ప్రకాశం! ఇదీ వరస. తన స్నేహితురాలు జయప్రద సంగీతం నేర్చుకోలా, అదేవిధంగా తానేమో నాట్యం నేర్చుకుంటుందట! మధ్యాహ్నం మూడు గంటలకు వెళ్తే సాయంత్రం ఆరు, ఆరున్నరకు గానీ తిరిగిరాదు. వచ్చిన తరువాత కాళ్ళూ చేతులూ సలుపుతున్నాయంటుంది".

గంట తొమ్మిది కొడుతుండగా అత్తయ్య భోజనానికి పిలిచింది.

పీటపైన కూర్చుంటూ "శోభ భోజనం చేయదా అత్తయ్యా" అన్నాడు ప్రకాశం.

"ఆ మాటెందుకులేరా ప్రకాశం! వారం రోజులైంది. లావు తగ్గడానికేం చేయాలని ఎవరినో డాక్టర్ని సలహా అడిగిందట. అప్పటికావిడేమో పిప్పళ్ళ బస్తాలా ఉన్నట్టు! ఆయన గారు రాత్రిపూట భోజనం మానేసి రెండు చపాతీలు, గ్లాసెడు పాలు పుచ్చుకోమన్నారట! అసలు సంగతి అదికాదులేరా ప్రకాశం! రోజుకిరవైసార్లు కాఫీ తీసుకుంటే తిండి ఎలా రుచిస్తుంది?"

అవును. ఏది తిండి కాదో దాన్ని తిండిక్రింద స్వీకరించడం వల్ల ఆరోగ్యం చెడిపోతుంది. ఏది వినోదం కాదో దాన్ని వినోదంగా పరిగణించడం వల్ల మానసి కారోగ్యం దెబ్బతింటుంది. కానీ ఈ మాట ఎవరితో చెబుతాడు ప్రకాశం? ఎవరు వినిపించుకుంటారు?

భోజనమైన తరువాత తాంబూలం నములుతూ బయటకు వచ్చి సోఫాపైన కూర్చున్నాడు ప్రకాశం.

సాయంత్రం ఆరుగంటలప్పుడు వినిపించినట్టుగా మళ్ళీ అదే పద ధ్వని చేరువకు వస్తోంది. అయితే ఈసారి వెనుతిరిగి చూడదలచుకోలేదు ప్రకాశం.

"సత్తుగుల్లలా అలా ఒళ్ళుముడుచుకుని కూర్చోకపోతే హాయిగా కాసేపు రోడ్లపైన షికారు తిరిగి రాగూడదా బావా? నేనైతే ఆడదాన్ని! రాత్రుల్లో నేను కాలుదీసి బయటపెడితే రకరకాల అనుమానాలు లోకులకు. నీకేం బావా! నువ్వు మగమహారాజువి. నిన్ను అడిగేవాళ్ళెవరు?"

పెదవి కదపకుండా శోభాదేవి వైపు బిక్కరించి చూస్తున్నాడు ప్రకాశం.

"నాలుగు మిరపకాయల్ని దిగదుడిచి పొయిలో వేద్దువుగానీ రావే అమ్మా! బావ అదేపనిగా నన్ను చూస్తున్నాడు...." ఎలుగెత్తి తల్లిని పిలుస్తూ పకపక నవ్వుతోంది శోభ.

శోభాదేవి చెప్పినట్టుగా రోడ్డుపైకి పారిపోవడమే ప్రకాశానికి శ్రేయస్కరమని పించింది.

"ఐనా నాలో ఏమంత విచిత్రం కనిపిస్తోంది బావా నీకు?" మళ్ళీ వివాదానికి నాంది.

ప్రకాశం తలదించుకున్నాడు.

"నేనూ మనిషినే బావా! నాకూ మనసుంది, నాకూ హృదయముంది. అందం కనిపిస్తే ఉద్రూతలూగుతుంది నా మనసు. అందంకోసం ఆరాటపడుతుంది నా హృదయం. ఈ ప్రపంచం నాది. ఇందలి అందాలు ఆనందాలు నావి! నావి నాకు దక్కనీయకుండా చేయాలని, నాకు వ్యతిరేకంగా జరిగే కుటిల ప్రయత్నాలను నేను ఎదిరిస్తాను...."

పాహిపాహి శోభా! నే నెవరిననుకుంటున్నావు? ప్రకాశాన్ని నేను, నిర్దోషిని - నోరు విడివడకపోవడం వల్ల ఈ క్షమాపణకు కూడా భావమున జీర్ణమైన సుభాషితానికి పట్టిన గతే పట్టింది.

మొదట బొంయిబొంయిమన్న హారను మ్రోత వినిపించింది. మరుక్షణంలో హారన్ మ్రోతతో బరాబరులు పలుక్కుంటూ పరతెంచి వస్తున్న కారు గేటు దగ్గర కనిపించింది. కిటికీలోనుంచి వెలుపలికి చూస్తూ జయప్రద చేతిని ఊపుతోంది.

కారులోనుంచి మామయ్య మాత్రమే క్రిందికి దిగారు.

"ఆశ్చర్యంగా ఉంది ప్రకాశం! అత్తిపువ్వులూ, తెల్లటి కాకులు కనిపించవట! నువ్వు మాత్రం కనిపిస్తున్నావే! అమ్మాయ్ శోభా, అదిగో జయప్రద! నీకోసం బయల్దేరి వస్తుంటే కారెక్కించి తీసుకొచ్చాను, దిగవమ్మా జయా...."

"ఎందుకు నాన్నా! మేమిద్దరమూ కలసి అలా కొంతదూరం వెళ్ళొస్తాము గాని, నువ్వు బావగారిని ఉయ్యేల్లో వేసి జోలపాడి జిజ్జిపోగొట్టు...."

ఏదో అక్కసుకు ప్రతీకలాంటి శోభాదేవి నవ్వు, అయోమయంగా ఉన్న జయప్రద నవ్వు, అమాయకంగా ఉన్న మాధవరావుగారి నవ్వు – ఆ నవ్వుల సుడిగుండంలో గింగుర్లు తిరుగుతూనే ఉన్నాడు ప్రకాశం – కారు వెనుదిరిగి వచ్చిన దారిగుండా వెళ్ళిపోయింది.

పడుకున్నాడే కానీ ప్రకాశానికి నిద్ర పట్టింది కాదు. హోరెత్తిపోతున్న ఆలోచనల అలజడిలో కాలాన్ని వేగిస్తూ అతడు గోడగడియారంలో గంట పన్నెండు గావడం కూడా విన్నాడు. శోభాదేవి ఇంకా ఇంటికి తిరిగివచ్చిన జాడలు లేవు. ఓ కునుకుతీసి మేలుకున్నాడు ప్రకాశం. ఎప్పుడొచ్చిందో ఏమిటో, గదిలో దీపం వేసుకుని గొంతెత్తి పాడుకుంటోంది శోభ. ఉదయం ఉపాహారం తీసుకున్న తర్వాత, ప్రయాణోన్ముఖుడైన ప్రకాశం శోభాదేవితో ఒకమాట చెప్పి వెళ్ళడం బాగుంటుందని మేడపైకి వెళ్ళాడు. గాఢ నిద్రలో ఉంది శోభ. నిద్రలేపడమెందుకని ప్రకాశం మౌనంగా తిరిగి వచ్చేశాడు....

వివాహం లాటరీ లాంటిదంటారు. దొరికిన దానితో సర్దుక పోగలిగిన వాళ్ళను ఈ లాటరీ బాధించదు. ఏది దొరికినా సరిపెట్టుకోలేని వాళ్లకు మాత్రం ఇంతకంటే విషమ పరీక్ష వేరొకటి ఉండదు.

సెకండ్ ఫారం దాకా చదువుకున్న ఓ అయినింటి అమ్మాయిని పెళ్ళాడాడు ప్రకాశం. పేరు సుభద్ర. గొప్ప అందగత్తె కూడా కాదు. కానీ ఇంగితం తెలుసుకుంటుంది. ఇంపుగా మాట్లాడుతుంది. ప్రకాశం పొలంలో ఉంటే కారియర్‌లో భోజనం తీసుకెళ్తుంది. ఇంట్లో ఉంటే పెరటిలోని చిక్కుడు తీగకు పందిరి వేయమంటుంది. రాత్రి పడుకున్న తరువాత "ఏమండీ! ఓ కథ చెప్పరూ" అని ప్రాధేయ పడుతుంది. ప్రకాశం కథ చెబుతుండగానే ఆదమరిచి నిద్రపోతుంది.

సుభద్ర నిద్రపోయి, తానింకా మేలుకుని పడుకున్న రాత్రివేళల్లో ప్రకాశం ఒక్కొక్కప్పుడు శోభాదేవిని గురించి ఆలోచించడం కద్దు – ఈ విశాల ప్రపంచంలో లోపమంటూ లేని మానవుడుండడు. ఐతే మిగిలిన లోపాలన్నీ ఒక ఎత్తు, తాము ఈ ప్రపంచం కోసం కాదనీ, తమ కోసమే ఈ ప్రపంచమనీ భావించడం ఒక ఎత్తు. ఈ భావన మూలంగా అడుగుపెట్టిన ప్రతిచోటా మానవుడికి అసంతృప్తి ఎదురౌతుంది. మంచినీళ్ళకోసం మరుభూమిలో పరిభ్రమించినట్టుగా, ఒక రంగంలో ఎదురైన అసంతృప్తి నుంచీ తప్పించుకోడానికి మరొకరంగంలోకి పారిపోవడం జరుగుతుంది. చివరికక్కడ ఎదురయ్యేది కూడా ఆశాభంగమే! ఏది కావాలో తెలియక పోవడం వల్ల, ఎక్కడికి వెళ్ళాలో నిర్ణయించుకోలేకపోవడం వల్ల అయోమయంలో పడిపోయి బ్రతుకంతా ఒక ఆందోళనగా పర్యవసించే ప్రమాదం ఉంది. ఈ ప్రమాదం నుంచీ శోభాదేవి ఎప్పుడు బయటపడుతుందో, అసలు బయటపడుతుందో పడదో ఎవరు చెప్పగలరు?

• *ఆంధ్రప్రదేశ్ – మాసపత్రిక 1965* •